




బంతి బంతికీ.. బెట్టింగ్

కొత్త పుంతలు..

రేటింగ్ ప్రకారం పందేలు..

మ్యాచ్ ప్రారంభం కాకముందే బాగా ఆడే టీమ్‌లను బట్టి బెట్టింగ్ యాప్‌ల్లో రేటింగ్ పెడతారు. యాప్‌లో చూపించే రేటింగ్ ప్రకారం పందేలు కాస్తారు. ఒక ఓవర్‌లో ఇన్ని పరు గులు తీయలేరు.. తీస్తారు, ఫలానా బ్యాట్స్‌మన్ ఎన్ని పరుగులు తీస్తాడు. ఎన్ని ఓవర్లలో ఎంత స్కోర్ చేస్తాడు.. ఇలా ఫ్యాన్సీలు ఆడుకునే అవకాశం ఇస్తారు. దీంతో మ్యాచ్ ఆరంభం నుంచి ముగిసే వరకు ప్రతి దానిపై పందేలకు జూదరులు సిద్ధమవుతున్నారు.

- యువతే లక్ష్యంగా మాఫియా సిద్ధం
- నేటి నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు
- ఆన్‌లైన్‌లో బహిరంగంగానే.. ప్రత్యేక యాప్‌లు
- జీవితాలను నాశనం చేస్తోన్న బెట్టింగ్‌లు
- గతంలో నరసరావుపేటలో ముగ్గురు బలవన్మరణం
- మే 25 వరకు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐపీఎల్‌కు క్రికెట్ క్రీడాకారులు సన్నద్ధమవుతుండగా.. పోటీలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండగా.. తమ అభిమాన క్రీడాకారుడి మెరుపులను చూసి మైమరిచేందుకు అభిమానులు ఎదురు చూస్తుండగా.. బెట్టింగ్‌లకు బుకీలు, పంటర్లు సిద్ధమవుతున్నారు. శనివారం నుంచి ఐపీఎల్ పోటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో యువతే లక్ష్యంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో బెట్టింగ్‌ల మాఫియా ఏర్పాట్లు చేసుకుంటోంది. ప్రతీ బాల్‌కు బెట్టింగ్ నిర్వహించేందుకు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను సిద్ధం చేసుకుంటున్నది. ఈ సారైనా డబ్బు సంపాదించాలని అత్యాసతో జూదరులు సమాయత్తమవుతున్నారు. సాంకేతికతను మాఫియా అందిపుచ్చుకుని బెట్టింగ్‌లను నిర్వహించేందుకు సిద్ధమైంది. బెట్టింగ్ విధానంలోనూ మార్పులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా క్రికెట్ కోసం యాప్‌లు వచ్చాయి. దీంతో ఫోన్ ద్వారా నేరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. బెట్టింగ్ నిర్వహించేవారు సదరు యాప్స్ వివరాలు ముందుగా తెలియజేస్తారు. పందేలు కాసేవారి నుంచి ముందుగా కొంత నగదును యూపీఐ విధానంలో అడ్వాన్స్‌గా వసూలు చేస్తారు. నగదు ఎవరికి పంపుతున్నారో తెలియకుండా మాఫియా జాగ్రత్తలు తీసుకుంటోంది. యాప్‌లు నిర్వహించేది ఎవరు.. వారు ఎక్కడ ఉంటారన్న సమాచారం కూడా బయటకు రానివ్వరు. నగదు జమయ్యాక మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు బెట్టింగ్‌కు అవకాశం కల్పిస్తారు.

పిల్లల్ని కాపాడండని తల్లిదండ్రుల వినతి

ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభమవుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌ల నుంచి తమ పిల్లలను కాపాడాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో లేఖలు రాసినా పోలీసు అధికారులు చర్యలు తీసుకోలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బెట్టింగ్‌లు నిర్వహించే వ్యక్తులకు కొందరు పోలీసు అధికారులు సహకరించారని కూడా తెలిపారు. రొంపిచర్ల మండలానికి చెందిన ఇద్దరు బుకీల నుంచి తమ పిల్లలను రక్షించాలని వేడుకున్నారు. పోలీసు శాఖ బెట్టింగ్‌ల విషయంలో ఏవిధంగా స్పందిస్తుందో చూడాలి. గత సీజన్‌లో రొంపిచర్ల మండలం అలవాలకు చెందిన ఓ యువకుడు బెట్టింగ్‌లతో నష్టపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే మండలానికి చెందిన మరో యువకుడు, నరసరావుపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన మరో యువకుడు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. బెట్టింగ్‌లతో యువకులు బలవన్మరణం చెందుతున్నా వీటిని అరికట్టడంలో పోలీసు శాఖ స్పందించడంలేదన్న విమర్శలున్నాయి.

బెట్టింగ్‌లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో ఓ ప్రాంతంలో ఉండి నగదును తీసుకుని నేరుగా ఒకరితో ఒకరు పందేలు కట్టేవారు. ఆ పరిస్థితులు ఇప్పుడు లేవు. పంటర్లు, బుకీలు హోటళ్ల, లాడ్జీల్లో గదులను అద్దెకు తీసుకుని మ్యాచ్‌ల గెలుపు ఓటములపై పందేలు కాసేవారు. ఈ ఓవర్‌లో ఇన్ని పరుగులు వస్తాయి.. ఏ బ్యాట్స్‌మన్ ఎంత స్కోరు చేస్తాడు.. ఈ బాల్‌కు ఎన్ని పరుగులు వస్తాయి.. తదితరాలపై నగదు కలుపుకుని పందేలు కాసేవారు. అయితే సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటి పందేలు తగ్గిపోయాయి. సెల్‌ఫోన్‌లోనే బెట్టింగ్‌లు కాయడం.. నగదు మార్పిడి జరిగిపోతోంది. ఎవరు ఎవరికి నగదు పంపిస్తారు.. ఎవరు బెట్టింగ్ నిర్వహిస్తారు.. అన్న విషయాలు బహిర్గతం కాకుండా అంతా జరిగిపోతుంటోంది. ఈ పరిస్థితుల్లో శనివారం నుంచి ప్రారంభమై మే 25 వరకు జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల్లో బెట్టింగ్‌లతో నష్టపోయి ఎంతోమంది వీధిన పడనున్నారు.

ఆసక్తితో.. అప్పుల ఊబిలో యువత

క్రికెట్ పందేల వైపు యువతే ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. కళాశాల విద్యార్థులు మొబైల్ యాప్ ద్వారా అత్యధికంగా పందేలు కాస్తున్నారు. మొబైల్‌లు, ల్యాప్‌టాప్‌లు, బంగారు చైన్లు, బైకులు, కార్లు కుదవ పెట్టి అప్పులు తీసుకుని పందేలు కాస్తున్నారు. చివరకు జీవితాలనే నాశనం చేసుకుంటున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షిస్తూ బెట్టింగ్ మాయలో చిక్కుకోకుండా చూడాలని పలువురు సూచిస్తున్నారు. మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు ఫోన్లతో పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలని, విలువైన వస్తువులు కనిపించకపోయినా, ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నా పెద్దలు అప్రమత్తమవ్వాలని హెచ్చరిస్తున్నారు. ఏదిఏమైనా మే 25 వరకు తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు.



డెకాయ్ కస్టమర్లతో.. ఆపరేషన్ గరుడ

- మందుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- డాక్టర్ చీటీ లేకుండా మందుల విక్రయాలపై కేసులు

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో శుక్రవారం విజిలెన్స్, పోలీసు శాఖలతో కలసి ఔషధ నియంత్రణ శాఖ అధికారులు రిటైల్ మందుల దుకాణాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు జరిపారు. ఎప్పటిలా జరిపే మొక్కుబడి తనిఖీల్లా కాకుండా ఈ దఫా.. ముందస్తుగా మఫ్టీలో ఉన్న పోలీసులను డెకాయ్ కస్టమర్లుగా (సాధారణ వినియోగదారుడుగా) దుకాణాలకు పంపారు. వీరికి సదరు దుకాణదారుడు డాక్టర్ చీటీ లేకుండా.. మత్తు బిళ్లలు, యాంటీబయోటిక్ మందులు విక్రయించడంతో.. సదరు పోలీసులనే సాక్షులుగా పెట్టి కేసులు నమోదు చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడ పేరుతో మందుల దుకాణాలపై దాడులు, ఆకస్మిక తనిఖీలు జరిపినట్లు అధికారులు తెలిపారు. మత్తు మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలువురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ చట్టవి రుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. గుంటూరులో మూడు, పల్నాడులో రెండు, బాపట్లలో రెండు మందుల షాపులపై కేసులు నమోదు చేసినట్లు గుంటూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్యశ్రావణ్‌కుమార్ తెలిపారు. గుంటూరులో జరిగిన తనిఖీల్లో సీఐలు చంద్రశేఖర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేట బరం పేటలోని భవ్య శ్రీ మెడికల్ షాప్ గోడౌన్లో అనుమ తులు లేకుండా భారీ స్థాయిలో ఔషధాలు నిల్వ ఉంచినట్లు గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో నరసరా వుపేట రూరల్ సీఐ పీ రామకృష్ణ, డ్రగ్ ఇన్స్పెక్టర్లు మంగమ్మ, పద్మ, విజిలెన్స్ ఏఈ శివనారాయణ, ఎఫ్ఆర్‌వో సైదులు పాల్గొన్నారు. మత్తు బిళ్లలు, మత్తు ఇంజక్షన్ల ఘటనలు వెలుగుచూసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బాపట్లలో అధికారుల తనిఖీలతో కొంతమంది షాపులు మూసివేశారు.

ఈ దాడుల్లో ఈగల్ టీమ్ హెడ్ విక్టర్, సీఐ కోటేశ్వరరావు, పట్టణ సీఐ ఆర్. రాంబాబు, విజిలెన్స్ అధికారి ఆదినారాయణచౌదరి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి. సాంబశివరావు పాల్గొన్నారు.



బాపట్ల : మందులషాపులో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

భలే చౌక బేరం..



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (శనివారం సాయంత్రం)
సహరి : 4.54 ఆదివారం ఉదయం)

ఉచిత బియ్యానికి.. రూ.12 రేషన్ బదులు లబ్ధిదారులకు నగదు

- జిల్లాలో యథేచ్ఛగా మాఫియా దందా
- నగదు బదిలీ కేంద్రాలుగా ఎండీయూలు
- పోటీ పడి మరీ బొక్కేస్తున్న అక్రమార్కులు
- పాలక పార్టీ నేతల అండతో బరితెగిస్తున్నారు
- గుంటూరులో బియ్యం సేకరణకు సిండికేట్ వేలం
- పల్నాడు జిల్లాలో రేషన్ డీలర్లే దళారుల అవతారం
- బాపట్ల జిల్లాలో నెలవారీ కప్పం.. దర్జాగా అక్రమార్జన

ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బియ్యానికి విలువ పెరుగుతోంది. బియ్యం సేకరణలో పోటీ పెరగడం.. మాఫియా రంగ ప్రవేశంతో పేదలకు వచ్చే రేషన్‌లో బియ్యం అందడంలేదు. బియ్యం బదులు నగదు చేతిలో పెట్టేస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం తీసుకుని దానిని తినలేక అమ్ముకునే వారు. కానీ గత కొంతకాలంగా అసలు బియ్యం ఇవ్వకుండానే లబ్ధిదారులకు నేరుగా నగదు ఇచ్చేస్తున్నారు. బియ్యాన్ని రేషన్ రాబందులు తన్నుకు పోతున్నాయి. రేషన్ షాపులకు వచ్చిన బియ్యం ఆ షాపుల్లోనే మాయం చేసేస్తున్నారు. కొందరు అధికారు లకు.. అధికార పార్టీ నేతలకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నా రన్న ఆరోపణలున్నాయి. రేషన్ పంపిణీపై అధికారుల పర్య వేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహిం చడాన్ని కూడా వారు విస్మరించారు. ఐదేళ్లు వైసీపీ నేతల కనుసన్నల్లో జరిగినట్లుగానే ప్రస్తుత అధికార పార్టీ నేతలు బియ్యం దందాను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతలు కొందరు బియ్యం అక్రమ వ్యాపారాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పేదల ఇళ్లలో ఉడకాల్సిన రేషన్ బియ్యం.. పెద్దలకు రూ.కోట్లు కురిపిస్తోంది. రూ.కోట్ల ఆదాయం కనిపిస్తుండటంతో అక్రమార్కులు సిండికేట్‌గా మారి ఎక్కడికక్కడ బియ్యాన్ని సేకరించి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో ఊహించని రీతిలో పట్టణాల నుంచి గ్రామాల వరకు పాకిన బియ్యం మాఫియా పేదల బియ్యాన్ని మింగేస్తోంది. ఈ క్రమంలో అధికారులు అక్రమాలను అడ్డుకోకుండా మామూళ్లతో మాయ చేస్తున్నారు. ప్రాంతాల వారీగా బియ్యం దందాను వ్యవస్థీకృతం చేయడంలో వైసీపీ నేతలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ప్రస్తుత పాలకపార్టీ నాయకుల తీరు ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ దందాలో ఎవరైనా బయటి వ్యక్తులు ప్రవేశిస్తే నేతలే అధికారులకు ఫిర్యాదు చేసి వారిని కట్టడి చేస్తున్నారు. కొందరు నేతలు రేషన్ బియ్యాన్ని ఆదాయ వనరుగా మార్చేసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ప్రతీ నెలా వేలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. బియ్యం కోటాకు బదులుగా ఎండీయూ వాహనదారులు కిలోకు రూ.12 వరకు లెక్క గట్టి మరీ కార్డుదారులకు నగదు ఇస్తున్నారు.

అధికారం అండ.. మాఫియా బరితెగింపు..

అధికార పార్టీ నేతల అండదండలతో బియ్యం అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. కార్డు దారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో నగం వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నదంటే ఆశ్చర్యం కాదు. గుంటూరుకు చెందిన ఇద్దరు మాఫియా పెద్దలు మొత్తం గుంటూరు జిల్లాలోని రేషన్ మాఫియానంతటినీ శాశిస్తున్నారన్న విషయం సర్వత్రా విదితమే. తెనాలిలో వైసీపీ ఎంపీటీసీ ఎండీయూ వాహన ఆపరేటర్ ముసుగులో బియ్యాన్ని నలబజారుకు తరలిస్తూ ఇటీవల పట్టుబడటం అక్రమార్కుల బరితెగింపునకు నిదర్శనంగా కనిపిస్తోంది. తెనాలి ప్రాంతంలో రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని (మిగతా 8వ పేజీలో)

అప్పుడు వాళ్లు.. ఇప్పుడు వీళ్లు

ప్రభుత్వం మారింది కానీ బియ్యం దందా ఆగలేదు. అదే దోపిడీ.. అవే కమీషన్లు. దందాలోని వ్యక్తులు కూడా వారే. వీరికి గతంలో, ఇప్పుడు అధికార పార్టీ నేతల అండగా ఉంటున్నారు. ఏడు నెలల వ్యవధిలో 103 వరకు 6ఏ కేసులు పెట్టినా దందాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. పైగా ఈ కేసులు తమకేం కొత్త కాదన్న రీతిలో మళ్లీమళ్లీ బియ్యాన్ని మాఫియా బొక్కేస్తోంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఓ గ్రామంలో అధికారులు తనిఖీలకు వెళ్లగా తాము పాలక పార్టీ నేతల అనుచరులమని చెప్పి వాగ్వాదానికి దిగారు. చీరాల నియోజకవర్గంలో అయితే ఏకంగా బేరాలాడి మారీ నెలవారీ ఫిక్స్ చేసు కుని దందాను నడిపిస్తున్నారు. కారంచేడు పరిధిలోని ఓ రైస్ మిల్లు బియ్యం దందాకు ప్రసిద్ధి. గత ప్రభుత్వంలో ఈ మిల్లు పైనే దాదాపు పది వరకు 6ఏ కేసులు నమోదయ్యాయి ఇప్పుడు కూడా ఆ మిల్లు కేంద్రంగానే రేషన్ దందా నడుస్తోంది. చీరాల నియోజకవర్గంలో రేషన్ మాఫియా రేటు నెలకు రూ.25 లక్షలు. ఈ మొత్తాలు అందుకునేది కీలక నేతలే. అంతిమంగా ఒంగోలులో ఉండే ఓ వ్యక్తికి ఈ దందా బాధ్యతలు అప్పగించారని సమాచారం. బాపట్ల టౌన్, రూరల్‌లో టీడీపీ ఓ ద్వితీయశ్రేణి నేత ఆధ్వర్యంలో దందా నడుస్తుండగా, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలా ల పరిధిలో గత ప్రభుత్వంలో చేసిన వ్యక్తే ఇప్పటికీ అక్రమ రవాణా చేస్తున్నారు. రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి నెలవారీ కప్పాన్ని ఫిక్స్ చేశారు.

నిరుపయోగంగా నిర్మాణం

- ఏళ్లుగా ప్రారంభం కాని ఓవర్ హెడ్‌ట్యాంకు
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని రైల్వేట్రాక్ అవతల వైపు ఉన్న 1 నుంచి 8 వార్డుల ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య తీర్చేందుకు రూ.1.80 కోట్లతో ఉప్పరపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. అయితే దీనిని ప్రారంభించి ఆయా వార్డుల్లోని ప్రజలకు తాగునీటిని అందించే విషయంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఎంపీ శ్రీరామ్ మాల్యాద్రి కృషితో సుమారు రూ.కోటి 80 లక్షలు వెచ్చించి ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టారు. రాబోయే 30 ఏళ్లలో పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని 850 కిలోలీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్‌ట్యాంక్‌ను నిర్మిం చారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, పాలకులు ఈ ట్యాంకును ప్రారంభించి ప్రజలకు తాగునీరు అందించే విషయంలో నిర్లక్ష్యం చేశారు. టీడీపీ హయాంలో నిర్మించారన్న కారణంతో ట్యాంకుకు అనుసంధానం చేస్తూ పైపులైన్లు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఫలితంగా ప్రారంభించకుండానే ఓవర్‌హెడ్ ట్యాంక్ పాడైపోతున్నది. దీనికి ఇన్‌లెట్, అవుట్‌లెట్ పైపులైన్లు ఏర్పాటు చేస్తే నీటిని సరఫరా చేయవచ్చు. అవుట్‌లెట్ పైపులైన్ల ఏర్పాటుకు రూ.13.50 లక్షలు కేటాయించి టెండర్లు పిలిచారు. ఇన్‌లెట్ పైపులైన్ కోసం సుమారు రూ.కోటి 50 లక్షలు అవసరం ఉంది. ఈ నిధులు కూడా మంజూరు చేస్తే 8 వార్డుల ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించవచ్చు. అయితే ఈ ఓవర్ హెడ్‌ట్యాంక్‌కు 600 మీటర్ల పంపింగ్ మెయిన్ పైపులైన్‌ను అమృత్ పథకంలో నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు.



ఉప్పరపాలెంలో నిర్మించిన ఓవర్‌హెడ్‌ట్యాంక్

తాగునీటి సరఫరాలో అవాంతరాలు

ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అనేక అవాంతరాలు తలెత్తుతున్నాయి. పట్టణ ప్రాంతంలో రోడ్ల విస్తరణ వల్ల పైపులైన్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలకు నీటి సరఫరాలో నిరంతరం సమస్య నెలకొంటున్నది. తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్న అధికారులు ఈ ట్యాంక్ ప్రారంభం గురించి ఆలోచించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. మందుబాబులకు అడ్డగా మారిన ఈ ప్రాంతంలో పెద్దఎత్తున మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి.

APS RTC
టెండరు ప్రకటన

బాపట్ల జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్లలో స్టాళ్ళు/ షాపులు, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుటకు అనుమతి, ఆసక్తి కలిగిన ఏజెన్సీల నుండి సీల్డు టెండరు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.24-03-2025 నుండి తేది.08-04-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గంటల నుండి సా॥5.00 గంటల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.09-04-2025న ఉ॥10.30 గంటల నుండి మ॥2.00 గంటల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, బాపట్ల నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గంటలకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం.P1/797(01)/2025-DPTO(BPTL),తేది: 21-03-2025 — సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, బాపట్ల.


నిందితుడి వివరాలను తెలుపుతున్న డీఎస్పీ జనార్ధనరావు పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ ప్రకాశరావు తదితరులు

విజయబాబుపై పీడీ యాక్ట్

- డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి, మారీసుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో పలు కేసులలో వున్న స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన తలవరస విజయబాబుపై పీడీ యాక్ట్ పెట్టినట్టు డీఎస్పీ బి జనార్ధనరావు తెలిపారు. శుక్రవారం పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జనార్ధనరావు మాట్లాడుతూ, నిందితుడు తన నేరప్రవృత్తిని మార్చుకోకుండా చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనడంతో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నామన్నారు. విజయబాబుపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో 14 కేసులు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మరొక కేసు ఉందని వివరించారు. నిందితుడిని జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఆరు నెలలు రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్‌ఐ ఎన్ ప్రకాశరావు పాల్గొన్నారు.

29న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న జరగనుంది. ఈ నెల 15వ తేదీన సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీలు బాయ్‌కాట్ చేసిన సంగతి తెలిసిందే. అందువల్ల కోరం లేకపోవడంతో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సమావేశాన్ని వాయిదా వేశారు. అందువల్ల జడ్పీ వార్షిక బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తిరిగి 29న సమావేశం ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ Wanted Teachers for all Subjects for a New School. Visit our office in housing board beside saibaba temple. H. No: 89-4-508, Guntur. 9494805749.
AJG-204389

➡ గుంటూరు అడ్వకేట్ ఆఫీస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను ఆకర్షణీయమైన జీతం కలదు. ఇంటర్వ్యూ సమయం 11 నుంచి సాయంత్రం 6:00 వరకు. సంప్ర: 9553749435, 95152 59047.
RK-2053

➡ Wanted Marketing Executives, Echo Technicians (male) - 1 to 5 Experience for a renowned 100 Bedded Hospital in Guntur, Call or Whats App Resumes on 94882 23333 Walk-in Interview 21st to 30th March,10am to 5pm.
AJG-210573

WANTED D.T.P OPERATOR

➡ పేజిమేకర్, ఫోటోషాప్, మ్యాథ్‌టైప్ నందు అనుభవం గల లేడి డిటిపి ఆపరేటర్ కావలెను. మారుతినగర్, ఏలూరు రోడ్, విజయవాడ. సంప్ర: సెల్ నెం.97030 07042
AJB- 209429

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209327

అమ్మకము

➡ గుంటూరు అమరావతి రోడ్డు, గోరంట్ల అంజలీ 1 అప్రూవల్ వెంచర్ నందు పడమర ఉత్తరం 40 ft రోడ్డులో 138 గజాలలో 2BHK G+1 అమ్మకానికి కలదు. సంప్ర॥ 72888 44999.
AJG-210515

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

రియల్ ఎస్టేట్

➡ గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ఫ్లాట్స్ & UDA అప్రూవ్డ్ ఫ్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మన్నెం లతీష్ గౌడ్. Ph : 9848986831.
SJAA-372

PLOT FOR SALE

➡ గుంటూరు పెదపలకలూరులోని మౌర్య వెంచర్‌లో హాస్పటల్ ప్రక్కన 2 & 3 ప్లాటు 768 చదరపు గజాల తూర్పు, ఉత్తరం & పడమర ప్లాటు అమ్మబడును. మరియు డెవలప్‌మెంట్‌కి ఇవ్వబడును. Ph: 9440108851.
RK-2056

సర్వీసెస్

➡ ఎస్ రిచ్ కన్‌స్ట్రక్షన్ & ఇంటీరియర్స్ : తక్కువ రేటు - మన్నికైన నిర్మాణం - అద్భుతమైన ఎలివేషన్ - అదిరిపోయే ఇంటీరియర్స్. మీ కలల ఇంటిని, నిర్మాణ మరియు ఇంటీరియర్స్ రంగంలో 16 సం॥ల పైగా అనుభవం కలిగిన ఇంజనీర్ నిపుణులచే నిర్మించుకోండి. మెటీరియల్ కాంట్రాక్టుతో, ఇంటి నిర్మాణం & ఇంటీరియర్ చేయబడును. Ph: 9676991122.
AJG-210521

CHANGE OF NAME

CHANGE OF SUR NAME

➡ I, CHINTALA AKKARAO (Old Name), S/o CHINTHALA VASANTHARAO, R/o. Door No. 2-108, Gudivada Village, Tenali Mandal, Guntur District - 522307, Andhra Pradesh. Hence, I have changed my sur name to CHINTHALA AKKARAO (New Name) S/o CHINTHALA VASANTHARAO. Hereafter my sur name is known as CHINTHALA AKKARAO
AJG-210246

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్ - 97036 18725
గుంటూరు 2 టౌన్ - 99854 01056
తెనాలి - 99854 11202
నరసరావుపేట - 99854 11206
బాపట్ల - 99663 35084
పిడుగురాళ్ళ - 93909 05725
మంగళగిరి - 93986 73618
అమరావతి - 95027 86195
పొన్నూరు - 97042 99094
రేపల్లె - 99854 12254
చిలకలూరిపేట - 98852 71281
వినుకొండ - 99662 50266
మాచర్ల - 88861 19952
సత్తెనపల్లి - 91103 23914
ప్రత్తిపాడు - 63004 34285
సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

రాజధానిలో నైపుణ్యం కలిగిన వాళ్లకు మంచి డిమాండ్

సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు


సమీక్ష నిర్వహిస్తున్న స్పెషలాఫీసర్ కే కన్నబాబు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పరిధిలో భారీగా నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్న దృష్ట్యా అందుకు తగ్గ నైపుణ్యం కలిగిన వారి అవసరం ఎంతో ఉందని జిల్లా స్పెషలాఫీసర్, సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఎస్‌డీసీ) ద్వారా నిరుద్యోగులకు అవసరమైన శిక్షణనిచ్చి సిద్ధం చేయాలన్నారు. స్కిల్ ఉంటే తప్పక ఎక్కువ వేతనంతో కూడిన ఉద్యోగం, ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. ఇటీవలే జిల్లా ప్రత్యేకాధికారిగా నియమితుడైన కన్నబాబు శుక్రవారం సాయంత్రం గుంటూరు నగరానికి వచ్చి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలలో అమలు జరుగుతున్న కార్యక్రమాల పురోగతి, ప్రణాళికలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

స్పెషలాఫీసర్ కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పెన్షన్ల పంపిణీని ఎలాంటి రిమార్కులు లేకుండా సమయానికి అందించాలని సూచించారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అధికారులందరు సమన్వయంతో అమలు చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా హోమ్ కంపోస్టింగ్‌పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు మున్సిపల్ అధికారులు ప్రోత్సహించాలన్నారు. ఇందుకు గాను ఒక ప్రత్యేకమైన డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. దీపం పథకం-2 ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్న గ్యాస్ బండ వివరాలను సివిల్ సప్లయిస్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రోడ్లు, డ్రెయిన్ల వివరాలను డ్వామా పీడీ శంకర్ వివరించారు. హౌసింగ్, వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య, పశు సంవర్ధకం, పరిశ్రమల శాఖలలో చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షిస్తూ ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు.

జిల్లాలో చేపడుతున్న గుంతల రహిత రోడ్ల నిర్మాణం పురోగతిపై ఆర్ అండ్ బి ఎస్‌ఈ శ్రీనివాస మూర్తి వివరిస్తూ దాదాపు 98 శాతం పనులు పూర్తి అయ్యాయని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ప్రతి సోమవారం జిల్లా, మండల కేంద్రాలు, మున్సిపాలిటీలలో నిర్వహిస్తూ ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కరించడం జరుగుతున్నదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి గంగరాజు ప్రత్యేక అధికారికి వివరించారు. డివిజన్, జిల్లా రాష్ట్ర స్థాయిలలో పీజీఆర్‌ఎస్‌లో అందిన పిటీషన్ల పరిష్కారంపై ఆడిట్ టీములు ఏర్పాటు చేసి మానిటర్ చేయడం జరుగుతున్నదని వివరించారు. అనంతరం జిల్లాలో చేపట్టవలసిన, జరుగుతున్న మేజర్ ప్రాజెక్ట్ పనులపై సమీక్ష జరిగింది. శంకర్ విలాస్ వద్ద ఆర్‌ఓబి బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించి వున్న చిన్నపాటి అవరోధాలను పూర్తి చేసి ఈ నెలాఖరు లోపు పరిష్కరించి నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని ఆర్ అండ్ బి ఎస్‌ఈ ప్రత్యేక అధికారికి ఈ సందర్భంగా వివరించారు.

మన్నెయ్యను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు


మన్నెయ్యను కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

మాచర్లటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన వైసీపీ నేత ఊరబండి మన్నెయ్యను పోలీసులు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. గతేడాది మే 8వ తేదీన జంగమహేశ్వరపాడులో నాటుబాంబుల కేసులో మన్నెయ్య నిందితుడు. ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడు కావడంతో పీడీ యాక్ట్ అమలు కావడంతో మన్నెయ్య రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ కేసులో వాయిదా నిమిత్తం పోలీసులు రాజమండ్రి జైలు నుంచి తీసుకొచ్చి మాచర్ల కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పి ప్రశాంత్ వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేశారు. కాగా కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని మన్నెయ్య తరపు న్యాయవాది రామానాయక్ పిటీషన్ వేయగా న్యాయమూర్తి ప్రశాంత్ ఐదు నిమిషాలు మాట్లాడుకునేందుకు అనుమతినిచ్చారు. అనంతరం మన్నెయ్యను పోలీసు ఎస్కార్ట్‌తో దుర్గి ఎస్‌ఐ సుధీర్‌కుమార్ రాజమండ్రికి తరలించారు.

ఉమ్మడి జిల్లా వక్ఫ్ అధికారిగా మొహమ్మద్ హుస్సేన్

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వక్ఫ్ అధికారిగా మొహమ్మద్ హుస్సేన్‌ని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో నియమించారు. ఉమ్మడి గుంటూరుతో పాటు ప్రకాశం, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలకు కూడా ఆయన్నే బోర్డు నియమించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 519.60 అడుగులు ఉంది. ఇది 148.54 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7190 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,023 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు కారణంగా రద్దు చేసిన పలు ప్యాసింజర్ రైళ్లని శనివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచీగూడ - మిర్యాలగూడ - కాచీగూడ ప్యాసింజర్ రైళ్లను శుక్రవారమే పునరుద్ధరించామన్నారు. శనివారం నుంచి నడికుడి - మిర్యాలగూడ - నడికుడి, విజయవాడ - గుంటూరు - విజయవాడ రైళ్లను పట్టాలెక్కిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్చరీ ఛాంపియన్ షిప్ ప్రారంభం

పెదకాకాని, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహిస్తున్న లెనిన్ ఓల్గా మెమోరియల్ అండర్ 13, అండర్ 10 ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం యూనివర్సిటీలో ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ సభకు ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె గంగాధరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆర్చరీ పోటీలకు ఏఎన్‌యూ వేదిక కావడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్‌లో ఆర్చరీ విలువిద్యకు యూనివర్సిటీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఈ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు మంచి ప్రదర్శనను ఇవ్వడం ద్వారా తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి ప్రసంగిస్తూ క్రీడారంగ అభివృద్ధికి యూనివర్సిటీలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం మాట్లాడుతూ ఆర్చరీ క్రీడను రానున్న రోజుల్లో ఏఎన్‌యూలో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి అండర్ 13 విభాగంలో 700 మంది బాలబాలికలు పాల్గొంటున్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు


సీఐఎస్‌ఎఫ్ బృందంతో డిప్యూటీ కమాండెంట్ ప్రిషబ్

తీరంలో సీఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీ

చెరుకుపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీఐఎస్‌ఎఫ్ 56వ వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా తీరప్రాంతాలలోని మత్స్యకారులకు అవగాహన కల్పించడానికి సైక్లోథాన్-2025పేరుతో సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమాండెంట్ ప్రిషబ్ తెలిపారు. శుక్రవారం ఈ బృందం చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో విశ్రాంతి కోసం ఆగారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ప్రిషబ్ మాట్లాడుతూ తమ ఈ సైకిల్ యాత్ర కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనతో ఈ నెల 7వ తేదీన ప్రారంభమయ్యిందని ఈనెల 31న కన్యాకుమారి చేరడంతో ముగుస్తుందని చెప్పారు. ఈ యాత్ర రెండురూట్లలలో జరుగుతుందని తూర్పుతీరప్రాంతంలో ఒక బృందం, పశ్చిమ తీరప్రాంతంలో ఒకబృందం యాత్ర చేస్తుందని చెప్పారు. ఈ యాత్ర ముఖ్యఉద్దేశం తీరప్రాంత గ్రామాలలోని మత్స్యకారులకు గత విధుల గురించి వివరిస్తామన్నారు. ముఖ్యంగా డ్రగ్స్ నార్కోటిక్స్, తీవ్రవాదుల రవాణా గురించి వివరించామన్నారు. తీరప్రాంతంలో ఎవరైనా అనుమానితులు కనబడితే దగ్గరలో ఉన్న కోస్ట్‌గార్డ్‌కిగాని, పోలీస్‌స్టేషన్‌గాని తెలియజేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజల నుంచి తమ సైకిల్‌యాత్రకు అపూర్వమైన మద్దతు లభిస్తుందని దానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ అరవింద్‌శర్మ, అమిత్‌కుమార్, బృందం సభ్యులు 85 మంది, ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో రౌడీషీటర్‌కు 8 నెలల శిక్ష

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో రౌడీషీటర్‌కు ఎక్సైజ్, ప్రొహిబిషన్ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి స్పందన ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలలోకి వెళితే....2017జనవరి 22న తేదీన సాయంత్రం 07:00 గంటలకు రౌడీషీటర్ పాదర్తి రమేష్ ఎస్‌విఎన్ కాలనీలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేసి అతని నుంచి 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టాభిపురం పోలీసుల కేసు దర్యాప్తులో నిందితుడు గంజాయి విక్రయాన్ని ఆదాయ వనరుగా చేసుకొని జీవిస్తున్నాడని తెలిసింది. నిందితుడు పాదర్తి రమేష్‌పై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా నమోదు కావడంతో అతనిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి మీద అప్పటికే పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో నమోదైన మోసం కేసులో గుంటూరు జిల్లా జైలు లో శిక్ష అనుభవిస్తుండగా అతడిని జైలు నుంచి నేరుగా కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో రమేష్‌ను దోషిగా నిర్ధారించి, నిందితుడికి న్యాయమూర్తి స్పందన ఎనిమిది నెలల పాటు కఠిన జైలు శిక్ష విధించారు.

రూ.35 లక్షలతో పరారైన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు

● పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుడు

మాచర్లటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మీ పొలం అమ్మిపెడతాం.. మీకు మంచి రేటు ఇప్పిస్తాం.. అంటూ మాయమాటలు చెప్పి ఓ రైతు వద్ద రూ.35 లక్షల నగదుతో బ్రోకర్లు పరారైన సంఘటన మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం ముటుకూరు గ్రామంలో జరిగింది. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, తూగూడ గ్రామానికి చెందిన బండెల నరసింహారెడ్డి అనే రైతు దుర్గి మండలం ముటుకూరు గ్రామ శివారులో 6.88 ఎకరాలు మెట్ట పొలం కొనుగోలు చేశాడు. కుటుంబ అవసరాల నిమిత్తం తన పొలం అమ్మేందుకు మాచర్లకు చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు లింగారెడ్డి, అతని స్నేహితుడు మల్లేష్ యాదవ్‌ను ఆశ్రయించాడు. వారు మాదాసు వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి విక్రయ అగ్రిమెంట్ చేయించి అడ్వాన్సుగా రూ.8.90 లక్షలు ఇప్పించారు. మిగిలిన నగదును రిజిస్ట్రేషన్ రోజు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈనెల 15వ తేదీన నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం రూ.35లక్షల నగదును మధ్యవర్తిగా వ్యవహరించిన మల్లేష్ యాదవ్ తీసుకొని కారులో మాచర్ల వచ్చిన తర్వాత ఇస్తానని బండెల నరసింహారెడ్డితో నమ్మబలికి మాచర్ల వచ్చారు. నరసింహారెడ్డిని మాచర్ల లో దించివేసి మల్లేష్‌యాదవ్ కారులో నగదుతో పరారయ్యాడు. ఈ విషయాన్ని అతనితో కలిసి వచ్చిన లింగారెడ్డికి చెప్పగా రూ.20లక్షలు తమ కమీషన్ కింద తీసుకున్నామని, మిగిలిన రూ.15లక్షలు ఇప్పిస్తామని నరసింహారెడ్డికి తెలిపాడు. ఆ తరువాత ఫోన్లుచేసినా లింగారెడ్డి, మల్లేష్‌యాదవ్‌లు స్పందించకపోవడంతో బాధితుడు నరసింహారెడ్డి మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో మూడురోజుల క్రితం ఫిర్యాదు చేశాడు. తనను లింగారెడ్డి, మల్లేష్‌యాదవ్‌లు మోసంచేశారని, పొలంఅమ్మగా వచ్చిన రూ.35 లక్షల నగదును తీసుకెళ్లి నీకు చేతనైంది చేసుకో.. నీకు దిక్కున్నచోట చెప్పుకో అంటూ బెదిరించారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నరసరావుపేట పురపాలక సంఘు కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.340/2025/ఏ1 తేది. 21.03.2025.

బహిరంగ వేలం ప్రకటన

నరసరావుపేట పురపాలక సంఘమునకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది. 01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు దినసరి కూరగాయల మార్కెట్ (హోల్‌సేల్ & రిటైల్), సంత్రి మార్కెట్, చేపలు & మాంసం మార్కెట్, కబేళా - 1 మరియు కబేళా-2 మార్కెట్‌లలో ఆశీలు వసూలు చేసుకొను హక్కునకు గజిట్ షరతులకు లోబడి ది. 29-03-2025 శనివారం ఉదయం గం॥ 11.00 పురపాలక సంఘు కార్యాలయ ఆవరణలో శ్రీయుత కమీషనర్ వారిచే గాని వారి అనుమతి పొందిన అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

సం/- కమీషనర్, నరసరావుపేట పురపాలక సంఘం

పిడుగురాళ్లలో నకిలీ పెయింట్స్ తయారీ

- నంద్యాల, బాపట్ల తనిఖీల్లో గుర్తింపు

పిడుగురాళ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల అంటేనే మినీ ముంబాయిగా పేరుంది. ఎక్కడ వస్తువు అయినా క్షణాలలో అదే పోలికతో తయారు చేయడం ఇక్కడ కొందరికే దక్కుతుంది. దాంతో పిడుగురాళ్లను మినీ ముంబాయిగా పిలుస్తుండేవారు. రాష్ట్రంతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలలో నకిలీ నోట్ల చలామణి, నకిలీ సున్నం, నకిలీ పెయింట్స్ కూడా పిడుగురాళ్ల నుండే పలురకాల ప్రముఖ కంపెనీల పేరుతో ఇక్కడి నుండి మార్కెట్‌కు తరలిస్తుంటారు. గురువారం నంద్యాల, బాపట్ల జిల్లాల్లో ఏషియన్ కంపెనీ ప్రతినిధులు, పోలీసుల సంయుక్త దాడిలో అచ్చం ఏషియన్ పెయింట్స్ పోలినట్లుగా తయారైన నకిలీ పెయింట్స్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇన్‌వాయిస్, బిల్లులకు తయారీ ప్రాంతానికి ఎంతో తేడా వున్నట్లు కూడా పోలీసులు గుర్తించడం జరిగింది. నంద్యాలలో ఓ వ్యాపారిపై కేసు కూడా నమోదు చేసిన పోలీసులు ఆ వ్యాపారి ఇచ్చిన సమాచారం మేరకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుండి కొందరు సున్నం వ్యాపారులు, ఇటీవల పెయింటింగ్ రంగంలోకి దిగి అచ్చం ఒరిజినల్‌లాగానే గుర్తుపట్టలేని విధంగా ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ పెయింట్స్‌ను తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నట్లుగా గురువారం నంద్యాల, బాపట్లలో వెలుగులోకి రావడంతో పిడుగురాళ్లలో ఆ వ్యవహారాన్ని నడుపుతున్న కొందరు శుక్రవారం అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మొత్తం మీద పిడుగురాళ్ల వేదికగా గుంటూరు రోడ్డులో, పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు, మరికొందరు అరకొర అనుమతులతో విచ్చలవిడిగా పెయింట్స్‌ను తయారు చేసి ప్రజలకు, వ్యాపారులకు అంటగడుతున్నట్లు తెలుస్తుంది. గత ఏడాది గుంటూరు రూట్‌లో వున్న ఓ పెయింటింగ్ మిల్లులో ఓ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటనపై కొందరు వ్యాపారులు బాలుడి తల్లిదండ్రులను బెదిరించి విషయాన్ని బయటకు రాకుండా చేయడమే కాకుండా అప్పటి పోలీసులకు పెద్ద ఎత్తున మామూళ్లు పంచారనే ఆరోపణలు వున్నాయి. ఏది ఏమైనా నంద్యాల, బాపట్లలో కంపెనీ ప్రతినిధులు, పోలీసులు సేకరిస్తున్న సమాచారంతో పిడుగురాళ్లకు వున్న లింకేమిటో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

శ్రీరామా రూరల్ ప్రధానోపాధ్యాయురాలికి సమన్విత అవార్డు


ఉమారాణి

కొల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సమన్విత 2025 అవార్డుకు శ్రీరామా రూరల్ విద్యా సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి ఎంపికయ్యారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించనున్న ఈ అవార్డు ప్రదాన కార్యక్రమానికి భారతదేశంలో వివిధ రంగాలలో పని చేస్తున్న 9 మంది సమన్విత 2025 ప్రభావశీలులైన మహిళలుగా ఈ అవార్డును అందుకోనున్నారు. సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ అనే ప్రభుత్వేతర సంస్థ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యురాలు కమల్‌జిత్ సెహ్రావత్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డు ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎంపికైన ఉమారాణి 1986 నుంచి శ్రీరామాలో గణిత ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఈమె శ్రీరామా పూర్వ విద్యార్థి కావడం విశేషం. గడిచిన నాలుగు దశాబ్దాలుగా ఎన్నో వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆమెకు ఈ అవార్డు దక్కడంపై విద్యా సంస్థ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పల్నాడులో ప్రశాంతంగా దూరవిద్య పరీక్షలు

నరసరావుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడుజిల్లా వ్యాప్తంగా పదోతరగతి రెగ్యులర్, దూరవిద్య పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శుక్రవారం జరిగాయి. మూడో రోజు ఇంగ్లీషు పరీక్షకు జిల్లాలో మొత్తం 128 పరీక్షా కేంద్రాలలో 25,346 విద్యార్థులకు 25,111 మంది హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 24 మంది హాజరు అయ్యారు. 128 పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 22 సిట్టింగ్, 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. సార్వత్రిక విద్యాపీఠం పదోతరగతి పరీక్షలు-మార్చి 2025 జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలలో జరిగిన తెలుగు, ఉర్దూ పరీక్షకు 1151 మంది విద్యార్థులకు 1013 మంది విద్యార్థులు 88శాతం హాజరయ్యారు. 27 పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 14 సిట్టింగ్, 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ట్ లెవెల్ అబ్జర్వర్ జాయింట్ డైరెక్టర్ ఎన్ గీత చిలకలూరిపేట పట్టణంలోని 11 పరీక్షా కేంద్రాలు సందర్శించారు. డీఈవో ఎల్ చంద్రకళ గురుజాల, రెంటచింతల మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 75 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పురపాలక సంఘు కార్యాలయం, బాపట్ల.

ఆర్.ఓ.సి.నెం.205/2022/ఏ1 తేది : 21.03.2025.

బహిరంగ వేలము ప్రకటన

బాపట్ల పురపాలక సంఘు యాజమాన్య అధీనంలో గల ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు 2025 -2026 సం. అనగా ది.01.04.2025వ తేది నుండి ది.31.03.2026 అర్ధరాత్రి వరకు దినసరి రుసుము (ఆశీలు) వసూలు చేసుకొను హక్కు నిమిత్తం ది.25.03.2025న మంగళవారం ఉదయం గం.11.00లకు పురపాలక సంఘు కార్యాలయములో కమీషనరు గారిచే కాని, లేదా వారి అనుమతి పొందిన అధికారిచే కాని బహిరంగ వేలం నిర్వహింపబడును. వేలములో పాల్గొను పాటదారులు ఈ దిగువనుదహరింపబడిన ధరావత్తు చెల్లించి ధృవపత్రములు తప్పనిసరిగా దాఖలు చేయవలెను.

వ.నెం.	వేలం పాట వివరములు	వేలం ధరవత్తు	సాల్వెన్సీ వివరములు
1.	కూరగాయల సంత్రి మార్కెట్ మరియు మునిసిపల్ సరిహద్దులలోని రోడ్డు మార్జిన్‌లలో రుసుము వసూలు చేసుకొనుట	రూ.3,50,000/-లు	రూ.12,00,000/-లు విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు 15సం.ల ఇ.సి. దాఖలు పర్చవలెను.
2.	కూరగాయల మార్కెట్ లోపలి స్టాల్స్ 1 నుండి 76 వరకు రోజువారి అద్దెలు వసూలు చేసుకొనుట.	రూ.1,50,000/-లు	రూ. 10,00,000/-లు విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు 15 సం.ల ఇ.సి. దాఖలు పర్చవలెను.
3.	మాంసం మార్కెట్ మరియు జంతు వధశాల ఆశీలు వసూలు చేసుకొనుట.	రూ. 50,000/-లు	రూ.4,00,000/-లు విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు 15 సం.ల ఇ.సి. దాఖలు పర్చవలెను.
4.	చేపల మార్కెట్ ఆశీలు వసూలు చేసుకొనుట.	రూ.35,000/-లు	2,50,000/- లు విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు 15 సం.ల ఇ.సి.దాఖలు పర్చవలెను

పై తెలిపిన గుత్తలలో దేనినైనా, ఎట్టి కారణము తెలుపక నిలుపుదల చేయుట గాని, వాయిదా వేయుట గాని, తిరస్కరించుటకు గాని కమీషనరు గారికి పూర్తి అధికారము కలదు. సాల్వెన్సీ సర్టిఫికెటున్ను సంబంధిత మున్సిపల్ కమీషనరు/యమ్.పి.డి.ఓ/యమ్.ఆర్.ఓ., లచే ధృవీకరించబడవలెను.

ఇతర వివరములను కార్యాలయము పని చేయు వేళలలో సంబంధిత సెక్షన్ వారిని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

నోట్:- 1) ధరావత్తు మొత్తమును మున్సిపల్ కమీషనర్, బాపట్ల వారి పేర డిమాండ్ డ్రాఫ్ట్ రూపములో దాఖలు చేయవలెను. 2) వేలము పాట దక్కించుకున్న వారు తప్పనిసరిగా గెజిట్లో నిర్ణయించబడిన స్వీపింగ్ ఛార్జీలను నెలవారి కిస్తీలతో చెల్లించవలెను.

సం/- కమీషనరు, బాపట్ల పురపాలక సంఘం

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పంట నీటి కుంటలు యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : పంట నీటి కుంటలు యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పల్లె పండుగ, పంటనీటికుంటల నిర్మాణంపై ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అమరావతి నుంచి శుక్రవారం వీక్షణా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 276 గ్రామ పంచాయతీలలో 4వేల పంట నీటికుంటలు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందని చెప్పారు. శనివారం అన్ని ప్రాంతాలలో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. పంట నీటికుంటల పక్కనే కూరగాయల సాగు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికే అధికారికంగా 1524 పంటనీటి కుంటలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయన్నారు. తక్షణమే అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి ఏప్రిల్ 8వ తేదీ నాటికి 92 శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 878 గోకులాల షెడ్‌లు మంజూరు కాగా ప్రస్తుతం 551 గోకులాల షెడ్‌లు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

పల్లెపండుగ కార్యక్రమం కింద 881 సీసీ రోడ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల ద్వారా 157.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. 103.1 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న రహదార్లు లక్ష్యం మేరకు ఏప్రిల్ 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన సీసీ రోడ్లు అన్నింటిని ఉగాది పండుగ రోజు ప్రారంభించాలన్నారు. 241 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు చిన్న మరమ్మతులు చేయించాలని పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులలో దొంగమస్టర్‌లు వేయటం వంటివి చేస్తే ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేదిలేదని కలెక్టర్ హెచ్చరించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపాధి హామీ పథకం కూలీలతో పనులు చేయించరాదన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 12,500 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టిపెట్టాలన్నారు. రహదార్లు వెంట చెత్త కనపడితే సంబంధితాధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. పింఛన్ల పంపిణిలో ఐవీఆర్ఎస్ విధానం ద్వారా 1125 ఫిర్యాదులు ప్రజలు నుంచి వచ్చాయని కలెక్టర్ చెప్పారు. ఫిర్యాదులు ఇచ్చిన వారి వద్దకెళ్ళి విచారించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బాపట్లలో ప్రవేశించిన సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ

● ఘనస్వాగతం పలికిన అధికారులు, నాయకులు



సైకిల్ యాత్ర చేస్తున్న వారికి స్వాగతం పలుకుతున్న బాపట్ల నాయకులు

బాపట్ల,మార్చి21 (ఆంధ్రజ్యోతి) : సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలకత్తా నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ శుక్రవారం బాపట్లకు చేరుకుంది. సముద్రతీర పరిరక్షణ, భేటిబచావో, భేటిపడావో, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి అనే నినాదంతో 85 మంది సభ్యులతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. బాపట్ల విచ్చేసిన వీరికి పోలీసు అధికారులు, స్థానికనాయకులు స్వాగతం పలికారు. అల్పాహారం, భోజన విడిది ఏర్పాటు చేశారు. పచ్చిమిరప తోటలను ఆసక్తిగా వారు తిలకించారు. మహిళా కూలీలు తిలకం దిద్ది స్వాగతం పలకగా కూలీలకు స్వీట్‌లు తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు సైకిల్ ర్యాలీ చేస్తున్న వారికి స్వాగతం పలికి తగిన ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. డీఆర్‌వో గంగాధర్ గౌడ్, కమిషనర్ జి.రఘునాథరెడ్డి, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం చేరుకున్న సైకిల్ ర్యాలీ

కర్లపాలెం, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : సీఐఎస్ఎఫ్ టీమ్ 75 మంది సైకిల్ ర్యాలీ శుక్రవారం కర్లపాలెం చేరుకుంది. దేశ, రాష్ట్ర, జిల్లా ప్రజలను కేంద్ర పారిశ్రామిక భద్రతా సిబ్బందితో మమేకం చేస్తూ ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై పీహెచ్‌సీ వారు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

సైకిల్‌యాత్రదారులకు ఉచిత వైద్యశిబిరం

పిట్టలవానిపాలెం, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : సీఐఎస్ఎఫ్ టీమ్ 75 మంది సైకిల్ ర్యాలీగా శుక్రవారం చందోలు చేరుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని చందోలు-రెడ్డిపాలెం జాతీయ రహదారి పక్కన చందోలు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారులు డాక్టర్ ఎన్.చంద్రిక, డాక్టర్ ఎన్.దివ్య పర్యవేక్షణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆరోగ్య హెల్త్ సూపర్‌వైజర్ యు.నరసింహారావు, వైద్యశాల సిబ్బంది వారికి స్వాగతం పలికారు.

విద్యార్థులు టెక్నికల్ ఫెస్ట్‌లో పాల్గొనాలి



సభలో మాట్లాడుతున్న విజయవాడ లైలా న్యూట్రిసికల్స్ జనరల్ మేనేజర్ జి.కిషోర్‌బాబు

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు టెక్నికల్ ఫెస్ట్‌లో తరుచూ పాల్గొని జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలని విజయవాడ లైలా న్యూట్రిసికల్స్ జనరల్ మేనేజర్ జి.కిషోర్‌బాబు తెలిపారు. బాపట్ల బి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ వి.గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థి చదువు పూర్తి చేసుకొని బయటకెళ్ళే లోపు ఉద్యోగం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓరల్, పోస్టర్ ప్రజంటేషన్‌లో క్విజ్, ఎక్స్‌పో అండ్ ఇన్నోవేషన్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు వెంకట్రావు, చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి వెంకయ్య చౌదరి, కోశాధికారి వీరబ్రహ్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ తెన్నేటి కృషితో రైల్వే శాఖ అనుమతులు

● డివిజన్ రైల్వే ప్రయాణికుల కమిటీ మెంబరు పఠాన్ రాజేష్



గూడ్స్ రవాణాను పరిశీలిస్తున్న డివిజన్ రైల్వే ప్రయాణికుల కమిటీ మెంబరు పఠాన్ రాజేష్, టీడీపీ నాయకులు

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కృషితో బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఎగుమతులు, దిగుమతుల కోసం గూడ్స్ రైలు స్టాపింగ్ ఇవ్వటం హర్షణీయమని డివిజన్ రైల్వే ప్రయాణికుల కమిటీ మెంబరు పఠాన్ రాజేష్ తెలిపారు. టీడీపీ నాయకులు రైల్వే అధికారులతో కలిసి శుక్రవారం రైల్వేస్టేషన్‌ను సందర్శించి గూడ్స్ రాక్ వివరాలు గురించి చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం, చీరాల ఓడరేవుల పోర్ట్ అభివృద్ధి కోసం, బాపట్ల-రేపల్లెకు రైల్వేలైన్ మంజూరులో ఎంపీ విశేష కృషి చేశారన్నారు. వివిధ ఎక్స్‌ప్రెస్‌లు బాపట్లలో స్టాపింగ్ కోసం ఎంపీ ప్రతిపాదనలు చేశారన్నారు. టీడీపీ నాయకులు నక్కా ప్రకాష్, గవిని ప్రసాద్, జ్యోతిప్రసాద్, నర్రా ఏడుకొండలు, భీమా కోటేశ్వరరావు, రైల్వేస్టేషన్ మాస్టర్ మీనన్ పాల్గొన్నారు.

మహోన్నత సేవా పతాకానికి బాపట్ల డీఎస్పీ ఎంపిక

బాపట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు మహోన్నత సేవా పతకం అందుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఎంపిక చేసింది. నేరనియంత్రణకు ఆయన చేస్తున్న కృషికిగాను ఈ పతకం లభించింది. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు. ఉగాది రోజు రాష్ట్ర రాజధానిలో డీఎస్పీ పురస్కారం అందుకోనున్నారు.

రికవరి ఫోన్లు బాధితులకు అందజేత

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారికి శుక్రవారం సీఐ ఆర్.రాంబాబు ఫోన్‌లు ఇచ్చారు. పోగొట్టుకున్న బాధితులకు సంబంధించిన ఫోన్‌లు రికవరి చేసి ఐదుగురికి అందజేశారు. దీంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.



జంపని రాములమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన త్రిబుల్ స్టెప్పు స్పీడ్ బ్రేకర్



జంపని చివుకుల వారి చెరువు మలుపులో ఏర్పాటు చేసిన త్రిబుల్ స్టెప్పు స్పీడ్ బ్రేకర్

ప్రమాదాలకు నెలవు.. త్రిబుల్ స్టెప్పు స్పీడ్ బ్రేకర్లు

వేమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్స్ ప్రమాదాలకు నెలవుగా మారాయి. తెనాలి-వేమూరు ప్రధాన రహదారిపై ఆర్ అండ్ బీ శాఖ వారు పోలీసుల సూచనల మేరకు ప్రమాదాలకు నెలవుగా ఉన్న జంపని రాములమ్మ చెరువు వద్ద, చివుకుల వారి చెరువు మలుపులో త్రిబుల్ స్టెప్పు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

24 గంటలు ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ఈ మార్గంలో మూడు స్టెప్పులుగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ఉండటం వల్ల వాహనాలు వాటిపై స్లిప్పయి పడిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలతో పాటుగా మినీ లారీలు కూడా పడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నా యి. దీనికి తోడు ఈ మార్గంలో ఎక్కువగా ఇసుక లారీలు, ట్రాక్టర్లు తిరగడం వల్ల స్పీడు బ్రేకర్ల దగ్గర వాటిలోని ఇసుక స్పీడ్ బ్రేకర్ల మధ్య, వాటికి ఇరువైపులా పడుతోంది. ద్విచక్ర వాహనాలు వాటి సమీపంలోకి వచ్చే సరికి వాటి చక్రాలు ఇసుకపై స్లిప్పయి పడిపోవడంతో పాటు వాహన చోదకులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఇలా ప్రతిరోజూ స్పీడు బ్రేకర్ల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాటిని నియంత్రించేందుకు సింగిల్ స్టెప్‌గా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

బాపట్ల పాటకు మనో గళం

● సినీ గాయకుడు మనోతో చర్చించిన కలెక్టర్



జిల్లా విశిష్టతకు సంబంధించిన కరపత్రాన్ని ప్రముఖ సినీ గాయకుడు మనోకు అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల,మార్చి21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా గీతాన్ని పాడాలని ప్రముఖ సినీగాయకుడు మనో (నాగూర్‌బాబు)ను కలెక్టర్ జె.వెంకటమురళి కోరారు. చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారి దేవాలయానికి వెళుతూ మార్గమధ్యలో శుక్రవారం కలెక్టర్‌ను ఆయన కలిశారు. కలెక్టర్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. 10 నిమిషాలు పాటు జిల్లా గీతంపై చర్చించుకున్నారు. కలెక్టర్ కోరిక మేరకు జిల్లా గీతాన్ని ఆలపించటానికి మనో అంగీకరించారు. భావపురి రచయితల సంఘం కార్యదర్శి నందిరాజు విజయ్‌కుమార్ రచించిన గీతాన్ని బాపట్ల జిల్లా గీతంగా ఎంపిక చేశారు. బాపట్ల జిల్లా విశిష్టతను ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వారు ప్రచురించిన కరపత్రాన్ని కలెక్టర్ ద్వారా మనోకు అందజేశారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న మనో

పిట్టలవానిపాలెం, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు మళ్ళీ దర్శించుకోవాలనే కోరిక ఉంటుందని ప్రముఖ సినీ గాయకుడు మనో అన్నారు. శుక్రవారం సినీ గాయకుడు మనో (నాగూర్‌బాబు) వారి ఇద్దరు కుమారులతో కలిసి శ్రీబగళాముఖి అమ్మవారి దివ్య దర్శనం చేసుకున్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి : ఎస్పీ



కవాతునుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసుపేరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం సిబ్బంది నిర్వహించిన కవాతుకు ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని వీక్షించారు. అనంతరం పోలీసు సిబ్బందికి ఉన్న శాఖా పరమైన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖ నిర్వహించే విధులలో ప్రిజనర్ ఎస్కార్ట్ విధులు కీలకమైనవన్నారు. ఎస్కార్ట్ విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సిబ్బంది తెలియపరచగా వెంటనే ప్రతి సమస్య గురించి చర్చించి సంబంధితాధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయసారధి, ఎస్బిఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్‌ఆర్ఐ మౌలుద్దీన్, ఇతర పోలీసుఅధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలి : చార్వాక



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.చార్వాక

బాపట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలని అంటరానితననిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక కోరారు. ఈ విషయమై శుక్రవారం అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దళిత నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీవర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ రాజీవ్‌మిశ్రాని ఏర్పాటు చేయటం ఆయన 13 జిల్లాలలో పర్యటించి కేవలం మాదిగల విన్నపాలు మాత్రమే తీసుకొనిమాలలకు అన్యాయం చేయాలని కుట్ర చేసినట్లు అర్థమౌతుందన్నారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గుదే రాజారావు, గొర్రెముచ్చు వందనం, పర్రె కోటయ్య, కొరగంటి శ్యామ్, జోగి ప్రసంగి, అమ్మేశ్వరరావు, పేరలి కాంతరావు, కొచ్చెర వినయరాజు, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, హేమంత్ పాల్గొన్నారు.

వర్మి కంపోస్ట్‌తో సమగ్ర యాజమాన్యంపై శిక్షణ

బాపట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాల వర్మికంపోస్ట్ యూనిట్ విద్యార్థులు శుక్రవారం ఐసీఏఆర్ ఎస్సీ సబ్ ప్లాన్ కింద వర్మికంపోస్ట్ తయారీ విధానం గురించి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్మికంపోస్ట్‌తో సమగ్ర పోషక యాజమాన్యం, పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోయూనిట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.లత, డాక్టర్ కె.హేమ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

బాపట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కంచర్ల అవినాష్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, న్యాయవాది తిరువీధుల శంకరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు లాయర్ మాదాసు జయప్రకాష్, శామ్యూల్ జాన్సన్, మల్లికార్జునరెడ్డి, పులిపాటి రమేష్, జిడుగు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషక విలువలు

బాపట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సమాజంలో ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవటంలో శ్రద్ధ పెరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ మెంబర్స్ సెక్రటరి డాక్టర్ మండల శ్రీనివాసరావు తెలిపారు. వ్యవసాయ కళాశాల జన్యుశాస్త్రం, వృక్షప్రజనన విభాగం ఆధ్వర్యంలో సేంద్రియ చిరుధాన్యాలసాగు, సస్యరక్షణ, ఆరోగ్యప్రయోజనాలు, విలువ ఆధారిత ఉత్పత్తులపై శుక్రవారం శిక్షణకార్యక్రమాన్ని నిర్వహించారు. జన్యుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ లాల్ అహ్మద్‌మహ్మద్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్ జి.వినయ్‌కుమార్, డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ కిరణ్‌కుమార్ రైతులకు శిక్షణ ఇచ్చారు.

నేడు టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం

వేమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేమూరులోని టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మూడున్నర గంటలకు ఐదు మండలాల పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ ప్రతినిధులు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విచ్చేస్తారు. నాయకులు సమావేశానికి హాజరుకావాలని ప్రతినిధులు కోరారు.

నాటుసారాను రూపుమాపుతాం

● డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు

రేపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాటుసారాను పూర్తిగా రూపుమాపుతామని దానికై ప్రతి ఒక్కరూ తమతో కలిసి రావాలని ఎక్సైజ్ ఒంగోలు డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు అన్నారు. నిజాంపట్నం మండలం దిండి పంచాయతీ అదవల గ్రామంలో శుక్రవారం నవోదయ 2.0 గ్రామసభ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారుచెయ్యటం వలన వ్యక్తులపైనే కాకుండా కుటుంబాలపైన సమాజంపైన తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. నాటుసారా తయారు చేసినా, రవాణా, అమ్మకం వాటికి సంబంధించిన ముడిపదార్థాలు అమ్మినా తమకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, నాటుసారా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి దేవదత్తు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రామారావు, నగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లించాలి

రేపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీలను పొందాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ నాగలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో భారతీయ రిజర్వుబ్యాంకు, అవార్డు స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌డీవో సీసీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని తెలిపారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇసుకపల్లి మేనేజర్ రాము మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళ పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రభుకిరణ్, సీజీజీబీ బ్యాంకు మేనేజర్ రమేష్‌రెడ్డి, కె.జయరామ్, పి.పీటర్, నాగమణి, రైతులు, గ్రూపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో ప్రజల అవస్థలు : సీపీఎం

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గుంతల రోడ్లపై ప్రజలు అవస్థలు పడుతున్నట్లు ప్రజా చైతన్య యాత్రలో గుర్తించామని సీపీఎం బృంద సభ్యులు అన్నారు. అక్కివారిపాలెం, పెదపులివర్రు గ్రామాల్లో శుక్రవారం సీపీఎం ప్రజా చైతన్యయాత్ర బృందం పర్యటించింది. భట్టిప్రోలు నుంచి పెదపులివర్రు, అక్కివారిపాలెం ఆర్ అండ్ బీ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. అక్కివారిపాలెంలో తాగునీటి ట్యాంకు నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని, ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. యూటీఎఫ్ మండల కార్యదర్శి జి.సుధాకర్, సభ్యులు ఎం.సత్యనారాయణ, జి.నాగరాజు, పి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పాపవినాశన స్వామి దేవాలయ ఆస్తులపై విచారణ చేయాలి

చుండూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మున్నంగివారిపాలెంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన పాపవినాశన స్వామి దేవాలయానికి చెందిన భూముల ఆదాయం, 30 సంవత్సరాలుగా దేవదాయ శాఖ అధికారి లెక్కలు తేల్చడం లేదని గ్రామ సర్పంచ్ శ్రీరామమూర్తి, గ్రామస్తులు శుక్రవారం ఆరోపించారు. ఈ గుడికి మూడు పంటలు పండే సారవంతమైన 12 ఎకరాల భూములు ఉన్నాయి. ఎకరం భూమి కౌలు రూ.35 వేలు వరకు ఉంది. ఏడాది రూ.4 లక్షల ఆదాయం ఉంటుంది. 30 సంవత్సరాలుగా రూ.6 కోట్లకు పైగా ఆదాయం ఉంది. 20 సంవత్సరాలుగా ఈ గుడికి ఈవోగా మల్లంపాటి వీరారెడ్డి ఉంటున్నారు. 25 సంవత్సరాల క్రితం భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావంతో దేవాలయం గోపుర శిఖరం, ధ్వజ స్తంభం కూలిపోయాయి. అప్పటి నుంచి దేవాలయంలో పూజలు, ధూపదీప నైవేద్యాలు లేవు. దేవాలయం మూతపడింది కాని దేవాలయానికి చెందిన కోట్ల రూపాయల ఆస్తులు మాత్రం ఏమయ్యాయో అధికారి చెప్పడం లేదని, దేవదాయ కమిషన్ ఈ విషయంలో విచారణ జరిపి ఈ ప్రసిద్ధి దేవాలయాన్ని పరిరక్షించాలని, ఇప్పటివరకు వచ్చిన కోట్లాది రూపాయల ఆదాయంతో దేవాలయ పునఃనిర్మాణం చేపట్టాలని, సర్పంచ్, గ్రామస్థులు కోరుతున్నారు.

చంపాడులో ఏరువాక కేంద్రం ప్రత్యేక కార్యక్రమం

వేమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంపాడు గ్రామంలో బాపట్ల ఏరువాక కేంద్రం వారు రైతుల కోసంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలమురళీధర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు క్షేత్ర పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ ఉష మాట్లాడుతూ, నంద్యాల పరిశోధనా స్థానం ద్వారా విడుదల చేసిన ఎన్‌టిటి-5 నంద్యాల తెల్లజొన్న రకం నాణ్యమైనదని, దిగుబడి 18 నుంచి 20 క్వింటాళ్లు తప్పనిసరిగా వస్తుందని పొట్టి రకంగా ఉండటంతో పాటు గింజ నాణ్యంగా ఉంటాయని తెలిపారు. ఏడీఏ హుస్సేన్ సేంద్రీయ ఎరువులు, నేల ఆరోగ్య పరిస్థితులు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత, మురళీధర్ నాయక్, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

లక్కసాగు పద్ధతులపై రైతులకు శిక్షణ

బాపట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాల కీటక శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో రైతులకు లక్కసాగు పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు శిక్షణ ఇచ్చారు. లక్కపురుగు జాతులు, వాటి పెంపకానికి ఉపయోగించే చెట్లకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేసి రైతులకు అందజేశారు. కీటకశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఆర్.కోటేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణలో లక్కపురుగుల సేద్యం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం, చెరుకూరు గ్రామాలకు చెందిన రైతులు, ప్రొఫెసర్ ఎ.వినయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

ముఖ్యమంత్రి సహాయనిధి రూ.2.50 లక్షలు పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఓలేరు గ్రామానికి చెందిన డొక్కు వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే ఆనందబాబును ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపించారు. అక్కడ నుంచి వచ్చిన రూ.2.50 లక్షల చెక్కును శుక్రవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బడి, గుడి మధ్యలో మద్యం దుకాణం వద్దు

● రోడ్డుపై గ్రామస్థులు ధర్నా... డీఎస్పీకి ఫిర్యాదు



మద్యం దుకాణం వద్దని ధర్నా చేస్తున్న గ్రామస్థులు

రేపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : బడి, గుడి మధ్యలో మద్యం షాపు పెడితే ఉపేక్షించేది లేదని మండలంలోని పేటేరు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేపల్లె మండలం పేటేరు గ్రామంలో శివాలయం పక్కనే కల్యాణ మండపం, ప్రైవేటు పాఠశాల మధ్యలో మద్యం షాపు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తుంటే గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. నిత్యం గుడికి భక్తులు, బడికి విద్యార్థులు వెళుతుంటారని ఆ ప్రాంతంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దని కోరారు. రోడ్డుపై ధర్నా చేయటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్‌లు ధర్నా చేసే మహిళలతో మాట్లాడారు. గ్రామంలో మద్యం షాపు వద్దని అనుకుంటే ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని వారితో మాట్లాడారు. దీంతో గ్రామస్థులు ధర్నాను విరమించి రేపల్లెలోని డీఎస్పీ కార్యాలయంలో, ఎక్సైజ్ కార్యాలయంలో, తహసీల్దార్ కార్యాలయంలో బడి, గుడి మధ్య మద్యం షాపులు వద్దంటూ వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పేటేరు గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ప్రేమ్‌కుమార్



శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డ్రెయినేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రేమ్‌కుమార్

రేపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని డ్రెయినేజీ వ్యవస్థలో ఉన్న సమస్యలను అధ్యయనం చేసుకుని రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి మురుగుకాల్వలను అభివృద్ధి చేస్తామని డ్రెయినేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. డ్రెయినేజీ కార్యాలయంలో ఈఈగా ప్రేమ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇప్పటికే డ్రెయినేజీలను అభివృద్ధి, పూడికలు, కల్వర్టులు కట్టాల్సిన ప్రాంతాల్లో మరమ్మతుల కోసం అంచనాలు వేసి ఉన్నతాధికారులకు పంపటం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళి డ్రెయినేజీ వ్యవస్థలను మెరుగుపరిచేందుకు నిధులు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేత మురళీకృష్ణ

కొల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సీసీ రోడ్ల నిర్మాణ పనులను టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. కొల్లూరులోని బైపాస్ రోడ్డులో 300 మీటర్ల రహదారి దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో గుర్తించిన మురళీకృష్ణ రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులను మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభింపజేశారు. రోడ్డు నిర్మాణంలో ఒక వైపు ఉండే కుటుంబాల మురుగు నీరు వెళ్లేందుకు తూములు ఏర్పాటు చేయాలని కోరడంతో తూములను కూడా తీసుకువచ్చి నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆయా పనులను ఆయన పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణం చేయాలని సూచించారు. వెంకటేశ్వర టాకీసు వద్ద కల్వర్టు నిర్మాణం చేయాలని, ఆ కల్వర్టు సక్రమంగా లేకపోవడం వల్ల ఎగువ నుంచి మురుగు నీరు వెళ్లడం లేదని, వర్షాకాలంలో నీరు ముందుకు వెళ్లే వీలు లేక గృహాల్లోకి వస్తుందని స్థానికులు మైనేనికి వివరించి కల్వర్టు నిర్మాణంతో పాటు మురుగు కాల్వను కూడా వెడల్పు చేయాలని చెప్పడంతో కల్వర్టు నిర్మాణం చేయించేందుకు వారి హామీ ఇచ్చారు. ఆయన వెంట వేముల పల్లి మోహనకృష్ణ, సోమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు ఆర్థికసాయం

రేపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న టీడీపీ కార్యకర్తలకు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అండగా ఉంటారని తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి పంచాయతీ ఎస్టీకాలనీలో ఊపిరితిత్తులు, క్యాన్సర్‌తో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త గుణ్ణం సత్యంను శుక్రవారం ఆయన పరామర్శించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ అందించిన ఆర్థికసాయాన్ని వారికి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లపాటి యల్లయ్య, ఉప్పాల నాంచారయ్య, తులగం నాని, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

వేమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి, వేమూరు పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తున్న పది పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఇంగ్లీష్ పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో 144 మందికి 137 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారి సూచనలు పొంది యుందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... మోపిదేవి అక్కేశ్వరరావు గారి కుమారుడు మోపిదేవి శ్రీనివాసరావు గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్రయములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్రయములు రానిచో మా క్లయింట్ సదరు మోపిదేవి శ్రీనివాసరావు గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : తెనాలి ఆర్.డి., రేపల్లె సబ్‌డి. యిలాకా రేపల్లె నెం. 146/2రు యం. 2-00ట్లు న్నూ డి.నెం. 14.7/6రు, యం.0-40ట్లులో యం 0-28ట్లు వీరు విక్రయించిన 160 చు॥గ॥ ఖాళీ స్థలం హద్దులు తూర్పు : కొత్తిలగడ్డ రత్తయ్య గారికి విక్రయించిన యీ నెంబరులోని ప్లాట్ల హద్దు 3.6 అం॥లు, దక్షిణం : 20 అడుగులు వెడల్పు గల రోడ్డు హద్దు 40 అం॥లు, పడమర : 20 అడుగులు వెడల్పు గల రోడ్డు హద్దు 36అం॥లు, ఉత్తరం : పిల్లి కన్న వాని అని గొయ్యి అనే మురుగు కాలువ హద్దు 40 అం॥లు, యీ హద్దుల మధ్య 160 చు॥గ॥ లేక 134.4 చ.మీ. ఖాళీ స్థలము. DOC NO : 5565/2021, S.R.O. రేపల్లె.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారి సూచనలు పొంది యుందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... [illegible] గారి కుమారుడు [illegible] శ్రీనివాసరావు గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్రయములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్రయములు రానిచో మా క్లయింట్ సదరు [illegible] శ్రీనివాసరావు గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : గుంటూరు డి., గుంటూరు సబ్‌డి. యిలాకా [illegible] గ్రామ పంచాయితీ ఏరియాలో [illegible] డి.నెం. 73/2 రు, యం. 4-15 సెంట్లున్నూ, డి.నెం. 73/3రు, యం. 4-35 సెంట్లున్నూ, డి.నెం. 74/2రు, యం. 1-00 సెంట్లున్నూ, [illegible] యం. 9-50 సెంట్లు [illegible] యం. 3-68 సెంట్లు [illegible] 1 టు 10 [illegible] నెం. 16,17రు ప్లాట్లు చ.గ. 400లు [illegible] నెం. 17రు ప్లాటు చ.గ. 240లు [illegible] తూర్పు : [illegible] 40లు వెడల్పు గల రోడ్డు హద్దు అ. 36లు, దక్షిణం : నెం. 18రు ప్లాటు స్థలము హద్దు అ 60, పడమర : నెం. 4[illegible] ప్లాటు స్థలము హద్దు అ. 36లు, ఉత్తరం : నెం. 16రు ప్లాటు స్థలము హద్దు అ 60లు, యీ హద్దుల మధ్య చ.గ. 240లు లేక చ.మీ. 200-66రు ఖాళీ నివేశన స్థలము మొత్తం. DOC NO : 4975/2011, S.R.O. గుంటూరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914



జీఎంసీ-జీజీహెచ్ మధ్య ..సొరంగ మార్గం!

● నగర పాలక సంస్థను కోరిన జీఎంసీ ప్రిన్సిపాల్

గుంటూరు మెడికల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల నుంచి ప్రభుత్వ సమగ్రాస్పత్రి వరకు భూగర్భంలో సొరంగ మార్గం ఏర్పాటు చేయాలని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి శుక్రవారం గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుకు నగర పాలక సంస్థ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. త్వరలో రూ.98 కోట్లతో నూతనంగా నిర్మించనున్న శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్ వల్ల మూడేళ్ల పాటు జీఎంసీ, జీజీహెచ్ మధ్యరోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని వారు కమిషనర్‌కు వివరించారు. ప్రతి రోజూ వెయ్యి మంది వైద్య విద్యార్థులు, (ఫస్ట్ ఇయర్ నుంచి ఫోర్త్ ఇయర్ వరకు), 511 మంది మెడికల్ పీజీ విద్యార్థులు, 45 మంది సూపర్ స్పెషాలిటీ విద్యార్థులు, 150 మంది పారా మెడికల్ విద్యార్థులు, మరో 230 మంది పారా మెడికల్ డిప్లమో విద్యార్థులు క్లినికల్ శిక్షణ కోసం జీఎంసీ నుంచి జీజీహెచ్‌కు రావాల్సి ఉంటుందన్నారు. 1936 మంది వైద్య విద్యార్థులు, పారా మెడికల్ విద్యార్థులతో పాటు 500 మంది రోగులు వైద్యపరీక్షల కోసం జీజీహెచ్ నుంచి జీఎంసీ పెథాలజీ, మైక్రోబయాలజీ విభాగాలకు వస్తుంటారు.

శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం...

ప్రస్తుతం నిర్మించే నూతన బ్రిడ్జి వల్ల మూడేళ్ల పాటు జీఎంసీ, జీజీహెచ్ మధ్య రహదారి మూసుకుపోతుందని, దీని వల్ల ప్రతి రోజూ వేలాది మంది మెడికోలు, పీజీలు, రోగులు ఇబ్బందులు పడతారని ప్రిన్సిపాల్ వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వైద్య కళాశాల నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు భూగర్భంలో సొరంగ మార్గం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. మెడికల్ కాలేజీ నుంచి పోలీస్ ఇన్‌స్పెక్షన్ బంగ్లా వరకు దారి ఉందని, కేవలం పోలీసు ఐబీ నుంచి సుమారు 50 గజాల దూరం వరకు ప్రభుత్వాస్పత్రి పీజీ క్వార్టర్స్ వరకు సొరంగ మార్గం ఏర్పాటు చేస్తే సరిపోతుందని డాక్టర్ సుందరాచారీ వివరించారు. ఈ మార్గం శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తే భవిష్యత్తులో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిన తర్వాత కూడా సొరంగ మార్గం వినియోగించుకుంటారని ఆయన తెలిపారు. అంతకు ముందు గురువారం డాక్టర్ సుందరాచారీ, కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి ఈ ప్రతిపాదన తెలిపారు. ఆయన వెంట జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ ఉన్నారు.

పత్తికి ప్రాణం పోద్దాం

● అఖిల భారత కాటన్ వార్షిక సమావేశంలో శాస్త్రవేత్తలు

● గులాబీ పురుగు విజృంభణ, దిగుబడి తగ్గుదల పై ఆందోళన

● ఆంధ్రాలో పూర్తిగా పడిపోయిన సాగు విస్తీర్ణం



ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన భారత పత్తి వార్షిక సమావేశం-2025లో పాల్గొన్న డాక్టర్ సీడీ మాయి, వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మి, నాగ్‌పూర్ ఐసీఏఆర్ - సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి. ప్రసాద్, డాక్టర్ ఎస్.కె. శుక్లా, డాక్టర్ పీవీ సత్యనారాయణ తదితరులు

గుంటూరు సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంభవించిన వాతావరణ మార్పులతో జీవచ్ఛవంలా మారిన పత్తికి ప్రాణం పోయాల్సిన తరుణం ఆసన్నమైందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు సమీపంలోని లాం ఫామ్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అఖిల భారత పత్తి వార్షిక సమావేశం-2025 శుక్రవారం ఆరంభమయింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో జాతీయ స్థాయికి చెందిన 160 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన భారతదేశ పత్తి మనిషిగా పిలువబడే డాక్టర్ సీడీ మాయి మాట్లాడుతూ దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి ప్రారంభించిన మొదటి 'టెక్నాలజీ మిషన్ అఫ్ కాటన్' దేశంలో సాగు రూపురేఖలు మార్చిందన్నారు. అప్పుడు ప్రవేశపెట్టిన మొదటి మిషన్‌లోనే బీటీ పత్తి వంగడం రూపుదిద్దుకున్నది చెప్పారు. దాని ఫలితంగా పత్తి పంటలో ఉత్పత్తి, ఉత్పాదకత, లాభదాయకత పెరిగాయన్నారు. కొన్ని దశాబ్దాల తర్వాత గులాబిరంగు పురుగు తిరిగి రావడం ఆందోళనకరమన్నారు. దాన్ని తట్టుకొని, వాతావరణ పరిస్థితులను ఎదిరించే నూతన వంగడాల సృష్టి ద్వారానే దేశ భవిష్యత్ వస్త్ర అవసరాలు తీర్చగలమని పేర్కొన్నారు. నూతనంగా ఆరంభం కానున్న రెండవ మిషన్ లో 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' నినాదాన్ని ముందుకు తీసుకుపోవాలని అన్నారు. ఈ మిషన్ ఉత్పాదకత, సుస్థిరతను పెంపొందించడం, అతి పొడవైన స్టేపుల్ పత్తి రకాల సాగును (పొడవు పింజ పత్తి) ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యంగా పత్తి దిగుమ తులపై భారతదేశం ఆధారపడటాన్ని దృష్టిలో ఉంచుకొని వార్షిక దిగుమతులు 3 మిలియన్ బేళ్లను మించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. స్వదేశీ ఉత్పత్తిని పెంచడానికి తక్షణ విధి విధానాలు అవసరమని చెప్పారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీ మాట్లాడుతూ భారతదేశంలో పత్తి కాయతొలిచే పురుగును సమర్థవం తంగా నియంత్రించడం ద్వారా పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడంలో బీటీ వంగడాలు సమర్థవంతంగా పనిచేశాయని అన్నారు. ఎన్ జీ రంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసి విడుదల చేసిన పత్తి రకం 'నరసింహ (ఎన్ ఏ-1325)' గణనీయమైన విజయాన్ని సాధించినదని అన్నారు. నాగ్‌పూర్ ఐసీఏఆర్ - సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి. ప్రసాద్ మాట్లాడుతూ పత్తి ఉత్పత్తి 15 సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకుందని, ఒకప్పుడు రెండవ అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుగా ఉన్న ఏకీకృత ఆంధ్రప్రదేశ్ ప్రాంతం ఇప్పుడు వాతావరణ మార్పుల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గుతుందని పేర్కొన్నారు. డాక్టర్ ఎస్.కె. శుక్లా మాట్లాడుతూ భారతీయ పత్తిలో అధిక కలుషిత స్థాయిలపై ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రశాంత కుమార్ దాస్ మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులలో పత్తి నిరోధకతను, ఉత్పాదకతను పెంచడానికి జన్యుమార్పిడి సాంకేతికత చాలా అవసరమని అభిప్రాయ పడ్డారు.

రాష్ట్రంలో పాతాళానికి పడిపోయిన పత్తి సాగు..

ఆంధ్రప్రదేశ్‌లో పత్తి సాగు విస్తీర్ణం పాతాళానికి పడిపోయింది. 2001-2002 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో 10.02 లక్షల హెక్టార్లలో పత్తి సాగుచేయగా, 2023-2024 సంవత్సరంలో సాగు విస్తీర్ణం 4.27 లక్షలకు పడిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తి విస్తీర్ణం, దిగుబడి పూర్తిగా పడిపోయినట్లు వార్షిక సమావేశం-2025 నివేదిక స్పష్టం చేసున్నది. పత్తి ధరల పతనం, గులాబీ రంగు పురుగు వల్ల రైతాంగం ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

అభివృద్ధికి ఇసుక గ్రహణం

● ప్రభుత్వ పనులకు ఇసుక కొరత.. ● ప్రారంభంకాని ఇసుక రీచ్‌లు





నరసరావుపేట మునిసిపాల్టీలో ఇసుక కొరతతో నిలిచిపోయిన రహదారి నిర్మాణం, నరసరావుపేటలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రగతిపై ఇసుక ప్రభావం పడింది. పంచాయతీలు, మునిసిపాలిటీలలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుక గ్రహణం పట్టింది. జిల్లాలో ఇసుక రీచ్‌లను మైనింగ్ శాఖ మూసివేసింది. ప్రభుత్వం పల్లె పండుగలో భాగంగా సిమెంట్ రోడ్లు.. మురుగు కాలవుల నిర్మాణాలు చేపట్టారు. మునిసిపాల్టీలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిపై ఇసుక ప్రభావం పడింది. దీంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోతున్నాయి. నెల రోజులగా ఇసుక కొరత ఉందని సదరు అధికారులు చెబుతున్నారు. పొల్యూషన్ అనుమతులు లేకపోవడంతో గత నెల 6న ఇసుక రీచ్‌లు నిలిపివేసినట్టు మైనింగ్ శాఖ అధికారులు తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణంపై కూడా ఇసుక ప్రభావం పడింది.

ఇసుక సరఫరా కాకపోతుండటంతో ఇళ్ల నిర్మాణాలు కూడా నిలిచిపోతుండటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆరు రీచ్‌లను మైనింగ్ శాఖ నిర్వహించింది. వీటిలో పొందుగ రీచ్‌లో లక్ష్యాల మేర ఇసుక తవ్వకాలు జరిగాయి. మిగతా రీచ్‌లలో పూర్తి స్థాయిలో ఇసుక తవ్వకాలు జరగలేదు. ఐదు రీచ్‌ల నిర్వహణకు పొల్యూషన్ అనుమతులు లేదు. దీంతో మైనింగ్ శాఖ రీచ్‌లను మూసివేసింది. అనుమతులు వచ్చే వరకు అధికారికంగా ఇసుక రీచ్‌లను నిర్వహించే పరిస్థితులు లేవని సదరు అధికారులు తెలిపారు.

నరసరావుపేట మునిసిపాల్టీలో 10 ప్రగతి పనులు చేపట్టినట్టు ఇంజనీరింగ్ విభాగం అధికారి తెలిపారు. నెల రోజులుగా ఇసుక సరఫరా కాకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. చేపట్టిన పనులకు సూమారు మూడు వేల టన్నుల ఇసుక అవసరం ఉందని సదరు అధికారులు మైనింగ్ శాఖకు లేఖ రాశారు. దీనిపై నేటి వరకు స్పందించిన దాఖలాలు లేవు. అలాగే పేదలకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లు ఇసుక లేక నిలిచిపోతున్నాయి.

గృహనిర్మాణ శాఖ కూడా దాదాపు 8,500 టన్నుల ఇసుక అవసరం ఉందని మైనింగ్ శాఖకు ప్రతిపాదనలు పింపింది. పల్లెల్లో చేపట్టిన ప్రగతి పనులు కూడా నిలిచిపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ అనుమతులు పొంది ఇసుక రీచ్‌లు ప్రారంభిస్తేనే ప్రగతి పనులు మందుగు సాగే పరిస్థితి. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి.

విద్యుత్ సౌధ బృందానికి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

ముగిసిన విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

గుంటూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఉత్సాహంగా సాగుతున్న విద్యుత్‌శాఖ ఇంటర్ సర్కిల్ మహిళా ఉద్యోగుల క్రీడా, సాంస్కృతిక పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్, విజయవాడ వారి ఆధ్వర్యంలో మూడు రోజులుగా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. క్రీడా పోటీలు ఎన్‌టీఆర్ స్టేడియంలో, పాటలు, నాటికలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు సంగడిగుంట విద్యుత్ భవన్ ఆవరణలో సందడి వాతావరణంలో జరిగాయి. కాగా టోర్నమెంట్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విజయవాడలోని విద్యుత్ సౌధ మహిళా ఉద్యోగులు సాధించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో జరిగిన ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. సీపీడీసీఎల్ డైరక్టర్స్ జీవీటీఎస్ ప్రసాద్ (టెక్నికల్), ఎ రామ్‌దాస్ (ఫైనాన్స్), ఆపరేషన్స్ సర్కిల్స్ ఎస్‌ఈలు కేవీఎల్‌ఎన్ ప్రసాద్ (గుంటూరు), ఆంజనేయులు (బాపట్ల), విజయ్‌కుమార్ (పల్నాడు), ఇంధనశాఖ మంత్రి ఓఎస్‌డి ఏవీ సాంబశివరావు, ఈఈలు తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, జె హరిబాబు, నాగేశ్వరరావు పలువురు అధికారులు హాజరయ్యారు.



ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫి అందుకున్న మహిళా ఉద్యోగులు

మత్తులో ఎస్కార్ట్ పోలీసులు.. రిమాండ్ ఖైదీ పరారీ

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చేతులు తడిపితే మందు, మగువతో రిమాండ్ ఖైదీలు రాజభోగాలు అనుభవించవచ్చని ఎస్కార్ట్ పోలీసులు నిరూపించారు. ఓ చోరీ కేసులో బాపట్ల జైల్లో ఉన్న ఇద్దరు రిమాండ్ ఖైదీలను బాపట్లకు చెందిన ఏఆర్ పోలీసులు ఎస్కార్టుగా గురువారం గుంటూరు జిల్లా కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టులో వాయిదా అనంతరం తిరిగి వారిని బాపట్ల జైలుకు తరలించేందుకు గుంటూరు బస్టాండ్‌కు తీసుకెళ్లారు. అయితే బస్టాండ్ ఎదురుగా ఉన్న లాడ్జిలో రిమాండ్ ఖైదీలు ఇద్దరు మహిళలతో ఎంజాయ్ చేశారు. ఆ సమయంలో పోలీసులు పక్కనే ఉన్న బార్‌లో మద్యం మత్తులో మునిగి తేలుతున్నారు. ఇదే అదునుగా భావించిన ఓ రిమాండ్ ఖైదీ పారిపోయాడు. ఆలస్యంగా విషయం గ్రహించిన ఎస్కార్ట్ పోలీసులు పరారైన నిందితుడ్ని పట్టుకునేందుకు శుక్రవారం వరకు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో చేసేదేమీ లేక శుక్రవారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భలే చౌక బేరం

(5వ పేజీ తరువాయి)

పాలిష్‌పట్టి తరలిస్తుండగా గతంలో పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. తెనాలి ప్రాంతంలో సేకరించిన బియ్యాన్ని ఎక్కువగా పల్నాడు, గోదావరి జిల్లాలలోని వ్యాపారులకు రూ.20 వరకు అమ్ముతు న్నారు. వేమూరు, అమృతలూరు, చుండూ రు మండలాల్లోని రైస్ మిల్లులను లీజుకు తీసుకుని అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారుస్తున్నారు. పల్నాడు జిల్లాలో డీలర్లు దళారుల అవతారం ఎత్తి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమార్కులకు అందజేస్తున్నారు. జిల్లాలో బియ్యం అక్రమ వ్యాపారం రూ.11 కోట్లు సాగుతుండగా మామూళ్లు కూడా అదే స్థాయిలో చేతులు మారుతున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గతంలో పౌర సరఫరాల మంత్రి మనోహర్ తనిఖీలు చేసినప్పటికీ మాఫియా దోపిడీలో ఎలాంటి మార్పూ లేదు. బియ్యం మాఫియా అక్రమాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, మీడియాలో కథనాలు వస్తున్నా అధికారులు కనీసం కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. బాపట్ల జిల్లాలో గడచిన ఆరు నెలల వ్యవధిలో బియ్యం దొంగలపై 103 వరకు 6ఏ కేసులు నమోదు చేయగా 4180 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. అయినా ఈ కేసులేవీ వారి దందాను అడ్డుకోలేకపోతున్నాయి. తూతూ మంత్రంగా దాడులు.. మొక్కుబడి కేసులు తప్పితే బియ్యం మాఫియా మూలాలను అరికట్టడంపై అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. అధికారులు ఎవరిపై దాడులు చేయాలో కూడా నేతలే నిర్దేశించే స్థాయికి బియ్యం మాఫియా వేళ్లూనుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

బియ్యం బ్లాక్ మార్కెట్ ఇలా..

ఎక్కడికక్కడ కార్డుదారులకు ఎండీయూ వాహనదారులు, డీలర్లు రూ.12 వరకు నగదు ఇచ్చి బియ్యాన్ని సేకరిస్తున్నారు. వీరి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు కిలో రూ.14 నుంచి రూ.16 వరకు కొనుగోలు చేస్తున్నారు. స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని బియ్యం తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకుని సేకరించిన బియ్యానికి ఒక పట్టు పాలీష్ వేసి గోతాలు మారుస్తున్నారు. దీనిని టోకు వ్యాపారి కిలోకు రూ.28 ఇచ్చి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేస్తున్నాడు. మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు తరలించేవారు. కాకినాడ పోర్టులో తనిఖీల నేపథ్యంలో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్లు అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు.

ఆర్టీసీ..డోర్ డెలివరీ

● డోర్ డెలివరీ చేయలేమంటూ చేతులెత్తేసిన యాజమాన్యం

● నెల రోజుల పాటు ప్రచారానికే పరిమితం



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని కార్గో పార్శిల్ కార్యాలయం

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థ డోర్ డెలివరీలో వెనుకంజ వేసింది. పార్శిల్ ఉత్పత్తులను డోర్ డెలివరీ చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసిన ఆ సంస్థ అమల్లో మాత్రం విఫలమైంది. డోర్ డెలివరీకి అనుగుణంగా మానవ వనరులు సమకూర్చటంలో సరైన ప్రణాళికలు లేకపోవటంతోనే యాజమాన్యం చేతులెత్తేసిందన్న విమర్శలు వినిపిసున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం ఆర్టీసీ సొంతంగా 2016 నుంచి కార్గో పార్శిల్ సంస్థకు శ్రీకారం చుట్టింది. వస్తువులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా 24 గంటల్లో చేరేలా ప్రణాళికలు రూపొందించింది. వస్తు రవాణా గ్యారంటీ, నమ్మకంతో కూడిన వ్యాపారం కార్గో నిర్వహిస్తోంది. సరుకు రవాణాపై కిలో మీటర్ల దూరం, వస్తువు బరువును బట్టి ఛార్జీ నిర్ణయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో కార్గో పార్శిల్ రవాణా సంస్థకు నిత్యం ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ నుంచి నిత్యం జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనంతపూర్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సరుకు రవాణా జరుగుతుందని అధికారులు తెలిపారు. ఆర్టీసీ డిపోలతో పాటు జిల్లా వ్యాప్తంగా 20 మందికి పైగా ఆథరైజ్డ డీలరతో కమీషన్ ప్రాతిపదికన కార్గో పార్శిల్ ఏజంట్ల ద్వారా సరుకు రవాణా చేస్తున్నారు. ఇత గత ఏడాది ఆర్థిక సంవత్సరంలో రూ.12.21 కోట్లతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉమ్మడి జిల్లా ఉండగా ప్రస్తుతం గత డిసెంబరు నాటికి దాదాపు రూ. 9 కోట్ల ఆదాయంతో వ్యాపార లావాదేవీలు జరిగాయి. ఇదే సమయంలో కార్గో డోర్ డెలి వరీకి కూడా శ్రీకారం చుట్టింది. అయితే అమలుకు సంబంధించి ప్రణాళికలు రూపొం దించటంలో విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి. ఒకే రూట్‌లో వివిధ ప్రాంతాల్లో డోర్ డెలివరీ ఆర్డర్లు ఉంటే కలిసి వస్తుందని, ఎక్కడో ఒక ప్రాంతంలో డోర్ డెలివరీ ఆర్డర్ పడితే పింపంచటం కష్ట తరంగా మారుతుందని ఆ సంస్థలో ఓ అధికారి తెలిపారు. డోర్ డెలివరీకి వేసే ఛార్జీ, అక్కడకు చేరే నాటికి అయ్యే ఖర్చు డబుల్ అవుతుందని అందుకే డోర్ డెలివరీ వెనుకాడాల్సి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

డోర్ డెలివరీపై ప్రచారానికే పరిమితం....

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీపై ఈ ఏడాది జనవరిలో నెల రోజుల పాటు విస్తృత ప్రచారాలు చేపట్టారు. కార్గోలో పార్శిల్‌తో పాటు డోర్ డెలివరీ కూడా ఉందంటూ ఫ్లెక్సీలతో ప్రచారాలు చేపట్టారు. ఇందు కోసం నెల రోజుల పాటు ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఆ నెల రోజుల పాటు డోర్ డెలివరీ చేసిన అధికారులు తరువాత మాత్రం నిలిపివేశారు. ప్రస్తుతం డోర్ డెలివరీ అడిగితే లేదంటూ సమాధానం చెప్పటంతో అనేక మంది వెనుది రిగిపోతున్నారు. అయితే డోర్ డెలివరీకి అవసరమైన మానవ వనరులను సమకూర్చుకోవటంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



సత్తెనపల్లిలోని సచివాలయాలకు చేరిన ఎల్-1 స్కానర్లు

పింఛను పక్కా.. అవినీతి ఉండదిక

● సచివాలయాలకు చేరిన ఎల్-1 స్కానర్ల

● ఏప్రిల్ నుంచి వాటి ద్వారానే పంపిణీ

సత్తెనపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్‌ల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా అక్రమాలను నియంత్రించేందుకు ఆధునీకరించిన ఎల్-1 స్కానర్లను జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు, సచివాలయాలకు పంపిణీ చేసింది. ఏప్రిల్ నెల నుంచి వీటి సాయంతో పింఛన్‌లు పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌లకు సంబంధించి వేలి ముద్రలు పడని లబ్ధిదారులకు ఈ నెల వరకు ఎల్ జీరో ఆర్‌డీ పరికరాల సహాయంతో పంపిణీ చేస్తారు. ఇది పూర్తి స్థాయిలో ఫలితాన్ని ఇచ్చేది కాదు. లబ్ధిదారుల వేలి ముద్రలు వేస్తున్నా ఇబ్బందులు తలెత్తేవి. దీనికి తోడు కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలి ముద్రలు రూపొందించి పింఛన్‌లు పక్కదోవ పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆధునిక ఎల్-1 ఆర్‌డీ పరికరాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సచివాలయాలకు వాటిని అందజేసింది.

ఏప్రిల్ నుంచి వినియోగం

తాజాగా అందజేసిన ఎల్-1 ఆర్‌డీ పరికరాలతోనే ఏప్రిల్ నుంచి పింఛన్ అందించనున్నారు. ఈ మేరకు యూడీఏఐ ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించింది. దీంతో పాత పరికరాలు పని చేయవని ఆ సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. ఏ సచివాలయంలోనైనా పరికరం పని చేయకుంటే వాటి స్థానంలో కొత్తవి ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

ఇప్పటికే ఏర్పాట్లు

కొత్తగా వచ్చిన పరికరాల ద్వారానే ఏప్రిల్ నెల నుంచి పింఛన్‌లు పంపిణీ చేయనున్నాము. ఈ ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశాం. ఎక్కడైనా పరికరం పని చేయకుంటే వెంటనే కొత్తవి సమకూరుస్తాం.

- ఎన్ ఆనంద్ కుమార్, మునిసిపల్ కమిషనర్, సత్తెనపల్లి



నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయం

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..

నిదానంపాటి అమ్మవారి సన్నిధి

దుర్గి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత, ఆహ్లాదం కలబోతగా నిదానంపాటి అమ్మవారి దేవాలయ ప్రాంగణం విరాజిల్లుతోంది. పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగొప్పల గ్రామ సమీపంలో అటవీ ప్రదేశాన వెలసిన నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు.. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా ప్రతి ఇంటా కొంగుబంగారమై విరాజిల్లుతోంది.. నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి కీర్తి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. ప్రతి సంవత్సరం అమ్మవారి తిరునాళ్ల అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇరుగుపొరుగు జిల్లాల నుంచి భక్తులు ఇక్కడికి చేరుకొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కుబడులు తీర్చుకొని వెళ్తుంటారు. ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులు తరలిరావడం విశేషం.

అమ్మవారి తిరునాళ్ళకు విస్తృత ఏర్పాట్లు

రేపు అమ్మవారి తిరునాళ్లను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. దీనికి దేవాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తలనీలాలు సమర్పించేందుకు కేశఖండన శాల, తాగునీరు, వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. మొక్కులు తీర్చుకునే భక్తులు పొంగళ్లు వండుకునేందుకు షెడ్లు , భక్తులు అధిక సంఖ్యలో వస్తే వారికోసం మామిడితోటలో వంట చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. దానికి కావాల్సిన వంట సామగ్రి కూడా అందుబాటులో ఉంటాయి. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులతో కలిసి భోజనం చేసేందుకు కూడా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం. పల్నాటి ప్రాంత ప్రజలు తాము కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు మొదటగా ఇక్కడ పూజ చేయించడం అధికంగా కనిపిస్తుంది.





బాపట్ల రూరల్ పరిధిలోని
ఓ మిల్లులో భారీగా పట్టుబడిన బియ్యం (ఫైల్)

భలే చౌక బేరం

(3వ పేజీ తరువాయి)

పాలిష్‌పట్టి తరలిస్తుండగా గతంలో పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. తెనాలి ప్రాంతంలో సేకరించిన బియ్యాన్ని ఎక్కువగా పల్నాడు, గోదావరి జిల్లాలలోని వ్యాపారులకు రూ.20 వరకు అమ్ముతున్నారు. వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల్లోని రైస్ మిల్లులను లీజుకు తీసుకుని అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారుస్తున్నారు. పల్నాడు జిల్లాలో డీలర్లు దళారుల అవతారం ఎత్తి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమార్కులకు అందజేస్తున్నారు. జిల్లాలో బియ్యం అక్రమ వ్యాపారం రూ.11 కోట్లు సాగుతుండగా మామూళ్లు కూడా అదే స్థాయిలో చేతులు మారుతున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గతంలో పౌర సరఫరాల మంత్రి మనోహర్ తనిఖీలు చేసినప్పటికీ మాఫియా దోపిడీలో ఎలాంటి మార్పూ లేదు. బియ్యం మాఫియా అక్రమాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, మీడియాలో కథనాలు వస్తున్నా అధికారులు కనీసం కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. బాపట్ల జిల్లాలో గడచిన ఆరు నెలల వ్యవధిలో బియ్యం దొంగలపై 103 వరకు 6ఏ కేసులు నమోదు చేయగా 4180 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. అయినా ఈ కేసులేవీ వారి దందాను అడ్డుకోలేకపోతున్నాయి. తూతూమంత్రంగా దాడులు.. మొక్కుబడి కేసులు తప్పితే బియ్యం మాఫియా మూలాలను అరికట్టడంపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. అధికారులు ఎవరిపై దాడులు చేయాలో కూడా నేతలే నిర్దేశించే స్థాయికి బియ్యం మాఫియా వేళ్లానుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

బియ్యం బ్లాక్ మార్కెట్ ఇలా..

ఎక్కడికక్కడ కార్డుదారులకు ఎండీయూ వాహనదారులు, డీలర్లు రూ.12 వరకు నగదు ఇచ్చి బియ్యాన్ని సేకరిస్తున్నారు. వీరి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు కిలో రూ.14 నుంచి రూ.16 వరకు కొనుగోలు చేస్తున్నారు. స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని బియ్యం తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకుని సేకరించిన బియ్యానికి ఒక పట్టు పాలిష్ వేసి గోతాలు మారుస్తున్నారు. దీనిని టోకు వ్యాపారి కిలోకు రూ.28 ఇచ్చి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేస్తున్నాడు. మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు తరలించేవారు. కాకినాడ పోర్టులో తనిఖీల నేపథ్యంలో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్లు అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు.



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో నిర్వాహకులు

జాబ్‌మేళాలో 23 మందికి ఉద్యోగాలు

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత ముందుకు సాగాలని వైఏప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో జవహర్ విజ్ఞాన కేంద్రం, ఏపీ స్కిల్ హబ్, ఎంప్లాయ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. ఈసందర్భంగా 76 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా వారిలో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయి నియామక పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో సాయి ప్రసన్న, హారిక సౌగంధి, ధనుంజయ, సమీర్, సురేందర్ రెడ్డి, శ్రవణ్‌కుమార్, సుబ్బారెడ్డి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ కృతజ్ఞతలు

అద్దంకిటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చర్చించి తీర్మానం చేసి కేంద్ర ఎస్సీ కమిషన్‌కు రిపోర్టు పంపించడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ నాయకులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పూనూరి రమేష్, సీనియర్ నాయకులు పూనూరి నరేంద్ర, మందా నాగేశ్వరరావు, నాగిపోగు చక్రవర్తి, ఏసోబు, నాగరాజు, నేహేమియా, సామ్యూల్, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూ సమస్యపై తహసీల్దార్ విచారణ

పంగులూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమూరు గ్రామంలో దీర్ఘ కాలంగా ఉన్న అసైన్డ్ భూ సమస్యపై తహసీల్దార్ సింగారావు శుక్రవారం విచారణ చేపట్టారు. సర్వే నెంబరు 108లో సంపెంగుల వెంకటరమణయ్య, సంపెంగుల రూతుమ్మల మధ్య సాగు భూమి విషయమై వివాదం నెలకొంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు భూ సమస్య పరిష్కారం కోసం గ్రామంలో ఇరువురిని విచారించారు. అనంతరం గ్రామంలోని రేషన్ డీలర్లతో మాట్లాడుతూ కార్డుదారుల ఈకేవైసీ త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో రవి, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.



నారాకోడూరు గాయత్రి శక్తి పీఠంకు నగదు సాయం
అందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

గాయత్రి శక్తిపీఠంకు విరాళం

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నారాకోడూరు గాయత్రి శక్తి పీఠం, కల్యాణ మండపం, ప్రవచన మందిరానికి స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చెక్క చెన్న నారాయణ రూ.లక్ష నగదు అందజేశారు. పీఠం స్థానిక ప్రతినిధులు డీవీఆర్ మూర్తికి సంబంధిత నగదును వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు.దీంతో ప్రతినిధులు నారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, జనార్దనరావు, మురళీకృష్ణ, రమేష్‌బాబు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల సమస్యలపై కదలిక

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటనలు
గ్రామస్థుల సమస్యలను తెలుసుకుంటున్న ప్రాజెక్టు అధికారులు
ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల నుంచి పరిష్కారానికి నోచుకోని గుండ్లకమ్మ ముంపు గ్రామాల సమస్యల పరిష్కారంపై అధికారులలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇటీవల గుండ్లకమ్మ ముంపు గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారంపై కొరిశపాడు మండలం తమ్మవరంలో మంత్రి రవికుమార్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రాజెక్టు ,రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. ముంపు గ్రామాలు, పునరావాసకాలనీల సమస్యలపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. దీంతో ఇప్పటికే గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు యర్రబాలెం, మణికేశ్వరం, ధేనువకొండ, తిమ్మారెడ్డిపాలెం తదితర గ్రామాలలో గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి పర్యటించి క్షేత్ర స్థాయిలో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కాలనీలలో కల్పించాల్సిన మౌలిక వసతులను పరిశీలించారు. అదే సమయమంలో ఆయా గ్రామాలలో ఇంకా అందని ప్యాకేజీ, పరిహారం, ఇళ్ల స్థలాల సమస్యలను, జాబితాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టకేలకు మంత్రి రవికుమార్ ఆదేశాలతో గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులలో కదలిక రావటం, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలలో ఆశలు చిగురిస్తున్నాయి. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టులపై అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో త్వరలో ముంపు గ్రామాల ప్రజలు, పునరావాస కాలనీల సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు వేయి కళ్లతో వేచి చూస్తున్నారు.



మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను
పరిశీలిస్తున్న ఎస్‌డీసీ విజయజ్యోతి కుమారి(ఫైల్)

కుక్కలతో జనం బెంబేలు

మేదరమెట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువయింది. మండల కేంద్రం అయిన కొరిశపాడులో ప్రజలను, విద్యార్థులను కుక్కలు కరిచాయి. ఇటీవల కాలంలో ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కుక్కలు చూసి భయపడుతున్నారు. పొలం పనులకు, గ్రేడింగ్ పనులకు వెళ్లే మహిళలను కుక్కలు వెంబడించి మరీ కరుస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని ఒక్కసారిగా కుక్కలు అడ్డం రావడంతో కింద పడి గాయపడుతున్నారు. మేజర్ పంచాయతీ అయిన మేదరమెట్ల, రావినూతల, పమిడిపాడు గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాలల్లో కుక్కల వలన గాయపడిన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రేబిస్ ఇంజక్షన్ కోసం వచ్చే వారు ఎక్కువయ్యారు. గ్రామాలలో పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ సమస్య గత కొన్నేళ్లుగా ప్రజలను ఇబ్బంది పెడుతూనే ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాలలో కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొరిశపాడులో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న వీధి కుక్కలు

నర్సరీలు నాణ్యతతో సాగుచేయాలి

ఉద్యాన అధికారి జెన్నెమ్మ

మార్టూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి): ఉద్యానరైతులు నర్సరీలను రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతతో సాగుచేస్తూ ఉత్పత్తిని సాధించాలని జిల్లా ఉద్యాన అధికారి పి. జెన్నెమ్మ అన్నారు. శుక్రవారం మార్టూరు మండల పరిధిలో రాజుపాలెం సెంటర్ సమీపంలోని సాయి బాలాజీ కల్యాణ మండపంలో జిల్లాలోని ఉద్యాన పంటలను సాగుచేసే రైతులకు నర్సరీల నిర్వహణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెన్నెమ్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన దర్శి ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ షేడ్‌నెట్ల ద్వారా నర్సరీలను సాగుచేయడం, వాటిలో కూరగాయలను, పూలను పెంచడంపై రైతులకు పలు సూచనలు చేశారు. మరో ముఖ్య అతిథి మిరప శాస్త్రవేత్త ఎ. రజని మాట్లాడుతూ మిరప పంట సాగులో పురుగులు,తెగుళ్ల, వాటి నివారణోపాయాలను రైతులకు చక్కగా విశదీకరించారు. ఏపీఎంఐపీ జిల్లా పీడీ బీవీ రమణ , డిజిటల్ గ్రీన్ సంస్థ నుంచి విజయరేఖరెడ్డి,మార్టూరు ఉద్యాన అధికారి బి. హనుమంతనాయక్, ఇంకా అద్దంకి, చీరాల, పర్చూరు, కొల్లూరు, ఉద్యాన అధికారులు,మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, బొబ్బేపల్లి రైతు పి.శరత్ బాబు,వ్యవసాయ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహనా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి
జెన్నెమ్మ, వేదికపై శాస్త్రవేత్తలు రవీంద్రబాబు, రజని తదితరులు

షార్ట్‌పుట్‌లో ఎమ్మెల్యే కొండయ్యకు బహుమతి

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ లెజిస్లేటివ్స్ స్పోర్ట్స్ మీట్ 2025 షార్ట్‌పుట్ పోటీల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని బహుమతి సాధించారు. గురువారం జరిగిన పోటీల్లో సహచర ఎమ్మెల్యేలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కార్యక్రమంలో డిప్యూ టీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పా త్రుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి సహకరించండి

చేనేత కార్మికులకు ఏడాదంతా చేతి నిండ ఉపాధి కల్పించాలని వారి సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలతతో కలిసి రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవితను కలిసి స్థానికంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నేతన్నల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు నుంచి అవార్డును అందుకుంటున్న ఎమ్మెల్యే కొండయ్య. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు తదితరులు



సరిచేయకముందు

ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసిన అధికారులు

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఒరిగిన విద్యుత్ స్తంభాలను శుక్రవారం అధికారులు సరిచేశారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన'సరిచేయకుంటే... మీ పని సరి' కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. అద్దంకి పట్టణంలోని ఊరచెరువు కట్ట వెంబడి దామావారిపాలెం నుంచి ఇటుక బట్టీల రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదభరితంగా ఉన్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వెంటనే స్పందించిన అధికారులు విద్యుత్ స్తంభాలు సరిచేయటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సరిచేసిన తరువాత

ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై హర్షం

ఒంగోలు(రూరల్), మార్చి21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు బకాయిలు చె ల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6200కోట్ల నిధుల కేటాయించటం హర్షణీ యమని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇవ్వటంలో విఫలమైందని విమర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. డీఏ బకాయిలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అల్లిబోయిన రాంబాబు, యనమల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో బి ల్లు ప్రవేశ పెట్టడం అభి నందనీయమని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ పేర్కొన్నారు. ఒంగోలులో అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ఎస్సీల్లోని 59 కులాలకు సమానంగా అందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం దక్కుతుందనే న్యాయ సూత్రజ ఆధారంగా మాదిగలు చేస్తున్న పోరాటానికి చంద్రబాబు న్యాయం చేశారని తెలిపారు. కొలకలూరి విజయకుమార్, జయరాజ్, పత్రా బంగారం, డి.శ్రీనివాసరావు, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమ స్యల పరిష్కారానికి ఫైనాన్స్ మంత్రిత్వశాఖ, డీఎఫ్ఎస్ ఆధ్వర్యంలో సాను కూలంగా స్పందిం చడంతో సమ్మె వాయిదా వేసినట్లు బ్యాంకు యూనియ న్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద జరిగిన కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ కన్వీనర్ రాజీవ్‌రత్నదేవ్ మాట్లాడు తూ తాము చేపట్టిన సమ్మెపై సానుకూలంగా స్పందించడంతో తాత్కాలి కంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఏప్రిల్ మూడవ వారంలో ఫైనాన్స్ మంత్రిత్వ శాఖతో బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై సమవేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.శ్రీనివాసరావు, సుబ్బారావు, ఉమాశంకర్, వెంకటరెడ్డి, శ్రీధర్, బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, సుధాకర్‌రావు, హసన్, బ్రహ్మనాయుడు, ఏడుకొం డలు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కమాండెంట్ సంజీత్‌కుమార్, పక్కన ట్రైనీ డీఎస్పీ అభిషేక్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్

తీరంలో అప్రమత్తంగా ఉండాలి

రామాపురం(చీరాల), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తీరంలో ఉగ్రవాదులు, మాదక ద్రవ్యాలు, ఆయుధాల రవాణా వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ పేర్కొన్నారు. కోస్టల్ సైక్లోథాన్ -2025 సైకిల్ ర్యాలీ శుక్రవారం రాత్రి చీరాలలోని రామాపురంకు చేరుకుంది. ఈసందర్భంగా ట్రైనీ డీఎస్పీ అభిషేక్, రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మచిలీపట్నం నుంచి కన్యాకుమారి వరకు ప్రారంభించిన సైకిల్ ర్యాలీ ఈ నెల 31కి కన్యాకుమారి చేరుకుని ముగుస్తుందని చెప్పారు. సముద్రతీర భద్రత, ఇతర దేశాలకు చెందిన షిప్పులు, బోట్లు సంచరించినా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ ప్రభాకర్, అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విజిలెన్స్ ఎస్సై శశికుమార్, స్థానిక గ్రామ పెద్దలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా గ్రానైట్ రవాణా చేస్తే చర్యలు

బల్లికురవ. మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాయల్టీలు చెల్లించకుండా ఎవరైనా గ్రానైట్ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని బాపట్ల ఆర్టీవో కిషోర్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం బల్లికురవ మండల కేంద్రంలో గ్రానైట్ స్లాబుల లారీని నిలుపుదల చేసిన ఆర్టీవో తనిఖీలు చేశారు. బిల్లులకు సరిపడిన రాయి ఉందా అని తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రానైట్ అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. అలానే పరిమితికి మించి ముడిరాళ్లను లారీలపై తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



ఆలయ కమిటీ ప్రతినిధికి నగదు అందజేస్తున్న తాడి రమేష్ బాబు

అష్టలక్ష్మి ఆలయానికి రూ.1.25 లక్షల విరాళం

పర్చూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పర్చూరులో రూ.4కోట్ల వ్యయంతో రూపుదిద్దుకున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, సమేత అష్టలక్ష్మీ దేవాలయ అభివృద్ధికి పర్చూరుకు చెందిన తాడి రమేష్ బాబు శుక్రవారం రూ.లక్షా పాతిక వేల నగదును ఆలయ కమిటీ నిర్వహకులకు అందజేసి భక్తిని చాటుకున్నారు. ఉద్యోగ రీత్యా ఆయన ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి తనవంతు సాయం అందించాలన్న సంకల్పంతో నగదును అందజేసినట్లు రమేష్‌బాబు తెలిపారు. ఈకార్యక్రమంలో కోటా శ్రీనివాసరావు, పాబోలు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, సింహదాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెరుకూరు(పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సుబ్బారావు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన సిగినం సుబ్బారావు(43) ఈనెల 15న చెరుకూరు శివారులోని తన పంట పొలానికి ఇంజన్ ద్వారా నీరుపెట్టుకొని తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ఇంజన్‌ను తన ట్రాక్టర్ వెనుక కట్టుకొని కాలువ కట్టపైనుంచి రోడ్డు దిగుతున్న తరుణంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షత గాత్రుణ్ణి కుటుంబ సభ్యులు తొలుత గుంటూరులోని ఓప్రయివేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారటంతో గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చల్లారెడ్డి పాలెం పంచాయతీ నాయినిపల్లి గ్రామం బచ్చుల వారి పాలెం ఎత్తిపోతల పథకం కాలువలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అమ్మ ఆశ్రమంలో చోరీ

మార్టూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి):స్థానిక కొణిదెనరోడ్‌లోని అమ్మ ఆశ్రమంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు దంపతులు నివశించే గదిలోని బీరువాలో ఉన్న రెండున్నర సవర్ల విలువైన బంగారు వస్తువులు బుట్టలు, లాకెట్,పాపిడి బిళ్ల , 200 గ్రాములకు పైగా వెండివస్తువులు, దీపపు కుందెలు,కప్పులు,గ్లాసులుతదితరాలను ఎత్తుకు పోయారు.

ఆశ్రమంలో నివశించే చందు దంపతులు గురువారం రాత్రి వారి సొంతగ్రామమైన మండలంలోని రాజుపాలెంకు వెళ్లారు. దాంతో ఆశ్రమంలో ఎవరూ లేరు. శుక్రవారం ఉదయం ఆశ్రమం వద్దకు వచ్చిన చందు దంపతులు ఇంటిలోపలి తలుపు తెరచి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని గ్రహించారు.గుర్తుతెలియని వ్యక్తులు మెయిన్‌గేట్ నుంచి కాకుండా పక్కనే ఉన్న ఇనుప గ్రిల్ నుంచి లోపలి తాళంను పగల గొట్టి ఇంటిలోకి ప్రవేశించి దొంగతనం చేశారు. ఈ విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం బాధితుడు తెలిపారు.

అవీ..ఇవీ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చదువులేని వయోజనులపై ప్రత్యేక దృష్టి

వేటపాలెం(చీరాల), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : 15 సంవత్సరాలు పైబడి చదవడం, రాయడం రాని వయోజనులపై ప్రత్యేక దృష్టి సారించాలని వయోజన విద్యా శాఖ పర్యవేక్షకులు మనోరంజన్, ఎంఈవో సుబ్బయ్య అన్నారు. శుక్రవారం మండల వెలుగు కార్యాలయంలో ఏపీఎం కాటి అంజిబాబు ఆధ్వర్యంలో ఉల్లాస్ - నవ భారత సాక్షరతా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోజన విద్యపై ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నట్లు వివరించారు. ఈనేపథ్యంలో పొదుపు సంఘాల్లో మహిళలకు ముందుగా అక్షర జ్ఞానంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిచాలని సూచించారు. పురోగతిపై ఈనెల 23 వ తేదీన పరీక్షను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీ, సీసీలు, పొదుపు సంఘాల వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.


ఏబీసీ పరిధిలో పమిడిపాడు మేజర్‌పై రక్షణ గోడలు లేని వంతెన

రక్షణ గోడల్లేని వంతెన

● పొంచి ఉన్న ప్రమాదం

పంగులూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):రక్షణ గోడలు లేని వంతెనతో ప్రమాదం పొంచి ఉంది. ఏబీసీ పరిధిలోని పమిడిపాడు మేజర్‌పై ముప్పవరం సమీపంలో అద్దంకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. నిత్యం పలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో రాత్రి వేళ ఈ వంతెనపై ఎదురు వచ్చే వాహనాల వెలుతురులో మార్జిన్ గుర్తించలేక ద్విచక్ర వాహనచోదకులు ప్రధాన కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దశాబ్దాల కాలంగా ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని వాహన చోదకులు ఏకరువు పెడుతున్నారు. పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వంతెన నిడివి పెంచి నూతన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డులో సాగర్ కాలువపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు తక్షణమే నిర్మించాలని ముప్పవరం పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్, సజ్జా హేమలత

నేతన్నలకు నిత్యం పండుగే

● నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వంలో నేతన్నలకు నిత్యం పండుగేనని, గత వైసిపి ప్రభుత్వం హయాంలో చేనేతల దినోత్సవం నాడే నేతన్నల ఆత్మహత్యలు జరిగాయని నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ఇటీవల చేనేతలకు విద్యుత్ సబ్సిడీ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో సంబరాలు నిర్వహించారు. ముందుగా బస్టాండ్ సమీపంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి, ముక్కోణం పార్క్ కూడలిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా గడియార స్తంభం కూడలికి చేరుకుని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ చేనేతల కష్టాన్ని గుర్తించేది కూటమి ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, వివిధ హోదాల్లోని టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సత్తా చాటిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

జాతీయ సెమినార్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల సత్తా

చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఫార్మా సూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాసూటికల్ రీసెర్చ్ అంశంపై జతీయ స్థాయి సెమినార్ జరిగింది. చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. సుమారు 600 మంది పాల్గొని 100కు పైగా పోస్టర్ ప్రజెంటేషన్స్ అందించగా సెయింట్ ఆన్స్ విద్యార్థిని పావని మొదటి బహుమతి, దివ్యశ్రీ రెండవ బహుమతి, హసీనా మూడవ బహుమతి సాధించారు. ఈక్రమంలో శుక్రవారం కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వీరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నాగేశ్వరరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత నీరే దిక్కు


పర్చూరు వాగులో చేరిన మురుగుతో కలుషితంగా మారిన నీరు

వాగుల్లో కలుస్తున్న మురుగు నీరు
వాటినే మంచినీటి చెరువులకు నింపుతున్న వైనం
శుద్ధి చేయకుండానే కుళాయిల ద్వారా సరఫరా

పర్చూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : వాగుల్లో కలుస్తున్న మురుగు నీటితోనే మంచినీటి చెరువులను నింపి శుద్ధి చేయకుండా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పలు గ్రామాల నుంచి వచ్చే మురుగు నీరు పర్చూరు వాగులో కలుస్తోంది. కొందరు అయితే సెప్టిక్ ట్యాంకులు నిర్మించుకోకుండా ఇళ్ల వద్ద మురుగు కాలువల్లో నేరుగా వదులుతున్నారు. అలాగే ఓగేరు వాగు నీటితో పర్చూరు మండలంలోని వివిధ గ్రామాల చెరువులను నింపుతున్నారు. మంచినీటి అవసరాల కోసం సాగర్ కాలువలను వదిలిన తరుణంలో సైతం ఆనీరు నేరుగా వాగుకు చేరుతోంది. తద్వారా ఆయా గ్రామాల చెరువులకు వాగు ద్వారానే సరఫరా చేస్తున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ప్రవహించే మురుగు అంతా ఇదే ఓగేరు వాగులో కలుస్తోంది. ఇలా మురుగు నీరు కలుస్తున్న వాగులో నుంచి నీటిని మంచినీటి చెరువులకు నింపుతున్నారు. నిధుల కొరత సాకుతో ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు కూడా నోచుకోకపోవటం, ఉన్న ఫిల్టర్ బెడ్‌లు అలంకార ప్రాయంగా మారటంతో శుద్ధి చేయకుండా నేరుగా కలుషిత నీటిని ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు ఎక్కించి కుళాయిల ద్వారా పంచాయిలు సరఫరా చేస్తున్నాయి. కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజల ఆరోగ్యానికి, ప్రాణానికి ప్రమాదం పొంచి ఉన్నా ఎవరికి వారు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాల్సిన అధికారులు ఇది తమ పనికాదంటూ వ్యవహరించటం వల్లే ఇలాంటి కలుషిత నీటితో కాలం వెల్లబుచ్చాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కలుషిత నీటి ఇక్కట్ల నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


డ్రైనేజ్ కాలువ ద్వారా వాగుకు చేరుతున్న గ్రామాల్లోని మురుగు

గుండ్లకమ్మలో కలుస్తున్న అద్దంకి మురుగునీరు

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని అత్యధిక ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు నేరుగా గుండ్లకమ్మ నదిలో కలుస్తోంది. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో మురుగు నీరు శుద్ధి చేసే ప్లాంట్‌లు లేకపోవటంతో మురుగు నీరు నేరుగా వెళ్లి గుండ్లకమ్మ నది నీటి ప్రవాహంలో చేరుతోంది. గుండ్లకమ్మ నది నీటినే పలు గ్రామాలకు తాగునీటి కోసం వినియోగిస్తున్నారు. దీంతో కలుషిత నీటినే సరఫరా చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఒంగోలు నగరంతో పాటు కొరిశపాడు, పంగులూరు, అద్దంకి మండలాలలోని పలు గ్రామాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటిని వినియోగిస్తున్నారు. అద్దంకి సమగ్ర మంచినీటి పథకం కు కూడా గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటినే వినియోగించేలా పనులు జరుగుతున్నాయి.


గుండ్లకమ్మ నదిలోకి వెళ్తున్న అద్దంకి పట్టణంలోని మురుగు నీరు

వైభవంగా భక్తాంజనేయస్వామి తిరునాళ్ల

ఆకట్టుకున్న విద్యుత్ ప్రభ
భారీగా అన్నదానం
సీఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు


దేవస్థానం ప్రారంభంలో ఏర్పాటుచేసిన విద్యుత్ అలంకరణ (ఇన్‌సెట్లో) భక్తాంజనేయస్వామి


టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

మార్టూరు,మార్చి21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో సాగర్ కాలువ పక్కనే ఉన్న శ్రీభక్తాంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి 49 వ తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం బ్రహ్మాండంగా కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ తిరునాళ్లను తిలకించడానికి విచ్చేసిన ప్రజానీకాన్ని అలరించింది.ఉదయాన్నే భక్తాంజనేయస్వామి వద్ద ప్రధాన అర్చకులు వేణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా భక్తాంజనేయస్వామి రాతి విగ్రహం వద్ద తమలపాకుల దండతోస్వామి వారికి అలంకరణ చేశారు. అనంతరం గ్రామస్థులు ముఖ్యంగా మహిళలు అక్కడే పొంగళ్లు పెట్టి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామ ప్రజలు స్వామి వారికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఇక రాత్రి గ్రామంలో సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ట్రాక్టరుపై అలంకరించి ఊరేగించారు. అదేవిధంగా తిరునాళ్ల సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. టీడీపీ వారు ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభపై పాట కచేరీని నిర్వహించారు.దేవస్థానానికి వెళ్లే దారిలో సీతారామలక్ష్మణాంజనేయస్వామిలతోపాటు వెంకటేశ్వరస్వామిల ప్రతిరూపాలను విద్యుత్ అలంకరణతో అందంగా ఏర్పాటుచేశారు. వలపర్ల గ్రామానికి చుట్టుప్రక్కల రామకూరు, వల్లాపల్లి, కోనంకి, ఇసుకదర్శి, నాగరాజుపల్లి, మార్టూరు తదితర గ్రామాలనుంచి ప్రజలు తిరునాళ్లను చూసేందుకు భారీగా తరలి వచ్చారు.వారందరికీ భారీగా అన్నదానం ఏర్పాటుచేశారు.అయితే తిరునాళ్ల ప్రశాంతంగా జరగడానికి సీఐ ఎం. శేషగిరిరావు ఆధ్వర్యంలో మార్టూరు, యద్దనపూడి,తదితర స్టేషన్‌లకు చెందిన ఐదుగురు ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు,దాదాపుగా 40 మందితో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా

మంత్రి గొట్టిపాటి రవికుమార్

సంతమాగులూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరులో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా 80 మంది లబ్ధిదారులకు రూ.39 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వీటితో పాటు రూ.9 లక్షల విలువైన ఎల్వోసీలను ఇద్దరికి అందించారు. అనంతరం ప్రజా వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ అనారోగ్య సమస్యల వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు తల్లకిందులవుతాయని, ఆస్పత్రుల ఖర్చులతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వందలాది మందికి ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటి వరకు 439 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి చేకూరిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.


ప్రజల వినతులను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాధికార సారథులతో పార్టీ మరింత బలోపేతం

టీడీపీని బలోపేతం దిశగా సాధికార సారథులు మరింత కృషి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో సాధికార సారథులు పార్టీ గెలుపునకు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. పథకాలు అందని వారికి, సీఎంఆర్ఎఫ్ అవసరమైన వారిని సాధికార సారథులే గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న మొత్తం 4,500 మంది సాధికార సారథులను పార్టీ సభ్యులు కూడా సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

మేదరమెట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. శుక్రవారం మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూలులో జరుగుతున్న పరీక్షలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 458 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచామన్నారు. ఆయన వెంట మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ తదితరులు ఉన్నారు.

పంగులూరులో నీటి సరఫరాకు అంతరాయం

పంగులూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పంగులూరులోని కొంత ప్రాంతానికి రక్షిత నీటి సరఫరా నిలిచి పోయింది. గ్రామంలో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోవడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి రాంబాబును వివరణ కోరగా గ్రామంలో ఆర్‌డీఎస్ఎస్ విద్యుత్ పథకం అమలులో భాగంగా విద్యుత్ లైన్ నూతన నిర్మాణం జరుగుతున్న సందర్భంగా భూమిలో నీటి సరఫరా కోసం వేసిన పైపులు పగలడంతో సమస్య తలెత్తిందన్నారు. శుక్రవారం పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టామని, శనివారం నాటికి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఎత్తిపోతల పథకాల వినియోగమే లక్ష్యం


పోతుకట్లలో రైతులతో చర్చిస్తున్న ఐడీఎస్ విశ్రాంత డీఈ సత్యనారాయణ, ఎత్తిపోతల పథకం నిర్వాహకులు, రైతులు

పోతుకట్ల (పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు ఆరుతడులకు నీటిని అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. అందులో భాగంగా ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఐడీయస్) విశ్రాంత డీఈ సత్యనారాయణ నేతృత్వంలో పర్చూరు నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను పరిశీలించి మరమ్మతులకు కావలసిన నివేదికను తయారుచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని పోతుకట్ల గ్రామంలోని లక్ష్మీ లిఫ్ట్ ఇరిగేషన్ 1, 2లను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు. ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా 1400 ఎకరాల భూములకు ఆరుతడులు అందించేందుకు ఇవి ఎంతగానో దోహద పడతాయని మాజీ సర్పంచ్ మానం హరిబాబు అధికారులకు వివరించారు. ఈకార్యక్రమంలో మానం హరిబాబు, కమిటీ సభ్యులు కఠారి వీరయ్య, దేవరపల్లి పాపారావు, తెలగతోటి మహేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హత ఉన్న విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బల్లికురవ విద్యాలయం ప్రిన్సిపాల్ కె. సరళకుమారి కోరారు. శుక్రవారం అమె మాట్లాడుతూ కేజీబీవీలో 6 వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు ఏప్రిల్ 11 వరకు విద్యార్థినులు చేసుకోవచ్చన్నారు. డ్రాపౌట్స్ కలిగిన బాలికలకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందని, అలానే 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9110369460, 8639734009 నెంబర్లను సంప్రదించాలని అమె కోరారు.


బల్లికురవలోని కేజీబీవీ

ముఖాముఖి

నవోదయం 2.0తో నవశకానికి నాంది

● ఎక్సైజ్ సీఐ పేరం నాగేశ్వరరావు



చీరాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రత్యేక కృషి చేస్తుంది. ఈక్రమంలోనే గత ప్రభుత్వ హయాంలో అందించిన నాసిరకం మద్యాన్ని అణచివేసింది. అదే సమయంలో తక్కువ ధరకు నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నది. దీంతో చీరాల ఎక్సైజ్ సీఐ పేరం నాగేశ్వరరావుతో ఆంధ్రజ్యోతి ముఖాముఖి నిర్వహించింది.

ప్రశ్న: నాటుసారా నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి ?

జవాబు: నాటుసారా తయారీ నియంత్రణకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ఈక్రమంలో ఇప్పటికే సుమారు 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.అక్రమ మద్య రవాణా, నిల్వలు, విక్రయాలకు సంబంధించి సుమారు 140 కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: చీరాల పరిధిలో బెల్టు షాపులు సంగతి ఏమిటి ?

జవాబు : ప్రభుత్వ పాలసీని పారదర్శకంగా అమలు చేస్తున్నాం. బెల్టు షాపులు ఎక్కడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

ప్రశ్న: సిండికేట్ పరిస్థితి ఏమిటి ?

జవాబు: చీరాల స్టేషన్ పరిధిలో సిండికేట్ వ్యవహారం లేదు. వ్యక్తిగత దుకాణాలే ఉన్నాయి. అవి చట్ట పరిధిలోనే నడుస్తున్నాయి. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: షాపుల నుంచి నెలవారీ మామూళ్లు ఎవరికైనా ఉన్నాయా ?

జవాబు: చట్టబద్ధంగానే విధులు నిర్వహిస్తున్నాము. రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్నాను. ప్రభుత్వ పాలసీను అతిక్రమించలేను.

ప్రశ్న: సారా తయారీదారులకు ఏదైనా దిశా నిర్దేశాలు చేశారా ?

జవాబు: ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పలుమార్లు చెప్పాము. సత్ప్రవర్తన ఉంటే పొదుపు సంఘాలలో చేర్చి గ్రూపుల వారీగా రుణాలు అందించి, ఉపాధి కల్పిస్తాము.

'పది' పరీక్షకు 19 మంది విద్యార్థుల గైర్హాజరు

కారంచేడు(పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలోని స్వర్ణ , పర్చూరు మండలంలో శుక్రవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్వర్ణ గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. అలాగే పర్చూరు మండల పరిధిలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 672 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 16 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈవో వెంకట్రామయ్య తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈవో

మార్టూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి):మండలంలోని ద్రోణాదుల జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జరిగిన 10 వతరగతి పరీక్షలను ఎంఈవో వస్రాంనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్లో వసతులను తనిఖీచేశారు.అనంతరం ఎస్సీకాలనీలోని ఏపీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ శిథిలావస్థకు చేరిన స్కూలు గదులను దాతల సహకారంతో పునర్నిర్మాణం చేసేవిధంగా ప్రణాళికను తయారుచేసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు.

రేపు మార్టూరులో గోశాల 13 వ వార్షికోత్సవం

మార్టూరులో శ్రీ కృష్ణ పిరమిడ్ గో సంరక్షణ సేవా సమితి 13 వ వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పొత్తూరి వెంకట్రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

దగ్గుబాడు(పర్చూరు), మార్చి 21(ఆంధ్రజ్యోతి) కారంచేడు మండల పరిధిలోని దగ్గుబాడు గ్రామంలో జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు ఏవో సుధీర్ కుమార్ శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. శగన పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.5,650 మద్దతు ధరను కల్పించినట్లు ఏవో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎంఎన్ రాయ్ 138వ జయంతి

ఇంకొల్లు,మార్చి 21,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్టు సెంటర్‌లో శుక్రవారం ఎంఎన్‌రాయ్ 138వ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మేడూరి సత్యనారాయణ అధ్యక్షత రాడికల్ హ్యూమనిజం -నేటి ఆవశ్యకత అనే అంశంపై సదస్సు జరిగింది. భారత హేతువాద సంఘం ట్రెజరర్ షేక్ బాబు, ఏపీ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి,కరి హరిబాబు,పి.శ్రీనివాసరావు,నజీర్,సంగీతరావు, లింకన్ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ

అద్దంకి, మార్చి21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 40 మంది దివ్యాంగులకు శనివారం ఉదయం 10.30 గంటలకు అద్దంకిలో మూడు చక్రాల స్కూటీలను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేయనున్నారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లో జనరిక్ మందుల షాపును ప్రారంభించనున్నారు. ఉదయం 8.30 గంటలకు యద్దనపూడిలో జరిగే గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతిలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

అద్దంకిటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై సోషల్ ఆడిట్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. గ్రామంలో ఏడాదిగా జరిగిన పనులను తనిఖీ చేసి ఆయా పనుల వివరాలను గ్రామ సభలో వివరించారు.